
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 7 ఏప్రిల్ 2025

వైసీపీకి 'చొక్కాకుల' రాజీనామా



విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరొక నేత గుడ్‌బై చెప్పేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విశాఖ-కాకినాడ పెట్రో కారిడార్ రీజియన్ (వీకేపీసీఆర్) మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు వైసీపీకి రాజీనామా చేసినట్టు ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పార్టీలో నేతలు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లేదని, అధికారంలో ఉన్న ఐదేళ్లు రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసిన జగన్‌కు తిరిగి ప్రజలు ఓటేసే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతానికి ఏ పార్టీలోనూ చేరడం లేదని, భవిష్యత్తులో అనుచరులతో చర్చించి ఎందులో చేరాలనే దానిపై నిర్ణయం తీసుకుంటానన్నారు.

కన్నులపండువగా సీతారాముల కల్యాణోత్సవం







జగదాంబ కూడలి సమీపంలో ఉన్న అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు... పక్కన కల్యాణోత్సవంలో భాగంగా సీతారాముల వారికి హారతిస్తున్న అర్చకులు, కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తజనం

- శ్రీరామనవమి సందర్భంగా రామ నామంతో మార్మోగిన మహా నగరం
- రాములోరి పెళ్లిని కనులారా వీక్షించి తరించిన భక్తజనం

శ్రీరామనవమి సందర్భంగా మహా విశాఖ నగరం రామనామంతో మార్మోగిపోయింది. రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. రామాలయాల్లో, షిర్డీ సాయినాథుని మందిరాల్లోనూ శ్రీరామనవమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జగదాంబ కూడలి సమీపంలో ఉన్న అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా అర్చకులు జరిపారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బందితో పాటు వందలాది మంది భక్తులు సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు. అలాగే పోర్టు సీతారామ కల్యాణ మండపంలో శాస్త్రోక్తంగా వేదపండితులు రాములోరి పెళ్లిని నిర్వహించారు. వన్‌టౌన్‌లోని ఘోషాస్పత్రి వద్దనున్న కోదండ రామాలయంలో, రైల్వే న్యూకాలనీ, సింహగిరితో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపారు. అలాగే సీతమ్మధార, ఎంవీపీ ఈస్ట్‌పాయింట్ కాలనీ, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, తదితర ప్రాంతాల్లోని షిర్డీ సాయినాథుని ఆలయాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల హవా!

పౌరసరఫరాల శాఖలో ఇష్టారాజ్యం

ఒక ఇన్‌స్పెక్టర్‌కు 80 డిపోల పర్యవేక్షణ

- మంత్రి, అధికార పార్టీ నేత బంధువులమంటూ హల్‌చల్
- ఇదే శాఖలో ఏళ్లతరబడి పలువురు తిష్ట
- నెలవారీ మామూళ్లు, అథంటికేషన్‌కు వసూళ్లు
- బియ్యం అక్రమ వ్యాపారంపై నిఘా శూన్యం



పౌర సరఫరాల శాఖ జిల్లా కార్యాలయం

విశాఖపట్నం/గాజువాక/ఆరిలోవ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):

పౌర సరఫరాల శాఖ జిల్లా కార్యాలయంలో పలువురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు హల్‌చల్ చేస్తున్నారు. నగరంలో ఎక్కువమంది బినామీ రేషన్ డీలర్లుండడం... కార్డుదారుల్లో అధిక శాతం మంది బియ్యం విక్రయిస్తుండడంతో రూ.కోట్లలో అక్రమ వ్యాపారం జరుగుతోంది. వీటిని అరికట్టాల్సిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలోని నాలుగు మండలాలు, నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న 643 రేషన్ డిపోలలో 5.29 లక్షల బియ్యం కార్డులున్నాయి. ప్రతినెలా ఎనిమిది వేల టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. నగరంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌కు 15 నుంచి 20, సీనియర్‌కు 20 నుంచి 30 డిపోల పర్యవేక్షణ బాధ్యతలుంటాయి. కాగా అధికార పార్టీలో మంత్రి, కీలక పార్టీ నేత బంధువులమంటూ కొందరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. మంత్రి బంధువుగా చెప్పుకుంటున్న ఓ ఇన్‌స్పెక్టర్ ఏకంగా 80కు పైగా రేషన్ డిపోలను పర్యవేక్షిస్తున్నారు. మరో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ సెలవులో ఉన్నారు. అయినప్పటికీ తాను పనిచేసే సర్కిల్-2లో కర్రపెత్తనం చెలాయిస్తున్నారని, నెలవారీ మామూళ్లను ఎంచక్కా వసూలు చేస్తున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతంలో డ్వాక్రా సంఘం నిర్వహించే ఒక డిపో వ్యవహారంలో అప్పటి డీఎస్‌వోను మేనేజ్ చేసి

... మిగతా 6వ పేజీలో

సివిల్ సప్లయ్ శాఖలో ఆ ఉద్యోగిదే పెత్తనం

- సెలవులో ఉన్నా డీలర్లు, ఎండీయూలకు బెదిరింపు
- కలకలం రేపిన ఆడియో మెసేజ్

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖపై ఓ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నప్పటికీ తన హవాను కొనసాగిస్తున్నారు. ఏకంగా డీలర్లు, ఎండీయూలను బెదిరించే ఆడియో లీక్ కావడంతో కలకలం రేపింది. రైల్వే న్యూకాలనీ ఏరియాలో డిపో నంబర్-40 డీలర్ వ్యవహారంపై వివాదం కొనసాగుతుంది. రెండు వర్గాల మధ్య వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాలతో సమీపంలోని డిపో నంబరు-19కి డిపో-40ను అటాచ్ చేశారు. ఈ డిపోతో పాటు ఇసుకతోట ఏరియాలోని డిపో-546కు ఒక ఎండీయూకు బియ్యం పంపిణీ చేసే బాధ్యతను అప్పగించారు. ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఎండీయూ ఇసుకతోటలో డిపో-546 పరిధిలో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసి ఆరో తేదీ నుంచి డిపో-40 పరిధిలోని లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఈ విషయం పౌరసరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి సంబంధిత అధికారులకు తెలుసు. కాగా రైల్వే న్యూకాలనీకి చెందిన పలువురు కార్డుదారులు ఎమ్మెల్యే కార్యాలయానికి ఫోన్ చేసి ఎండీయూ తమకు సరకులు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారట. అటువంటప్పుడు విధుల్లో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ వాస్తవాలు చెప్పి వివరణ ఇచ్చుకోవచ్చు. అందుకు భిన్నంగా సెలవులో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఎండీయూ/డీలర్ల గ్రూప్‌లో ఒక ఆడియో మెసేజ్ పెట్టారు. రైల్వే న్యూకాలనీలో... మిగతా 6వ పేజీలో

మండిన నగరం

- 36.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలు



విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో నగరంలో ఆదివారం ఎండ సుర్రుమనిపించింది. రెండు మూడు రోజుల పాటు మధ్యాహ్నం వరకు మేఘాలు ఆవరించడంతో చల్లబడిన నగరవాసులు ఆదివారం ఎండతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉదయం నుంచే ఎండ, ఉక్కపోత కలబోతగా మారడంతో ఇళ్లలో ఉన్నవారు సైతం ఆపసోపాలు పడ్డారు. దీనికి తోడు ఆదివారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రామాలయాలకు వెళ్లిన వారంతా భానుడి తాపానికి గురయ్యారు. ఆదివారం సాయంత్రం గ్రామీణ ప్రాంతాల్లో వర్షంకురిసినా... నగరంలో ఆ జాడ లేకపోవడంతో మరింత ఉక్కపోత పెరిగింది. వివిధ పనుల మీద బయటకు వెళ్లినవారు, రామాలయాల్లో పూజలకు వెళ్లినవారు తిరిగివచ్చే సమయంలో నానాపాట్లు పడ్డారు. నగరవాసులు వేసవి తాపం నుంచి సేద తీరేందుకు సాయంత్రం ఆర్కే బీచ్, రుషికొండ తీరాలకు వెళ్లడంతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడాయి. ఆదివారం ఎయిర్‌పోర్టు వద్ద 36.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో ఎండల మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మధ్యాహ్న సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రాకూడదని, ఒకవేళ వచ్చినా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. కాగా నగరంలో ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు స్వాంతన చేకూర్చేందుకు వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువకులు ప్రజలకు తాగునీరు, మజ్జిగ, పుచ్చకాయ ముక్కలను పంపిణీ చేశారు. పూర్ణామార్కెట్ పందుపుళ్లల సందు వద్ద యువకులు, చిన్నారులు ఆర్టీసీ డ్రైవర్లు, ప్రయాణికులు, ఆటోల్లో ప్రయాణించే వారికి పుచ్చకాయ ముక్కలను పంపిణీ చేశారు.



పూర్ణామార్కెట్ వద్ద ఆర్టీసీ బస్ డ్రైవర్‌కు పుచ్చకాయ ముక్కలు అందజేస్తున్న చిన్నారులు

ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌టీ కార్నర్స్



- జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఏర్పాటు
- ఎండ తీవ్రత నేపథ్యంలో ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆరోగ్యశాఖ ఆదేశాలు
- ప్రతి సెంటర్‌లో సిబ్బంది, ఓఆర్ఎస్ ద్రావణం ఉండేలా చర్యలు
- ఒక్కో కేంద్రానికి వెయ్యి నుంచి ఐదు వేల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ
- సిద్ధంగా ఉన్న మరో 60 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఎండ వేడిమి వల్ల కలిగే ఇబ్బందులపై ప్రజలకు ఒకపక్క అవగాహన కల్పిస్తూనే.. మరో పక్క ప్రజలకు సేవలందించేందుకు ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఓఆర్‌టీ (ఓరల్ రీహైడ్రేషన్ థెరపీ) కార్నర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ సిబ్బందికి ఆదేశాలను జారీ చేసింది. ఈ ఓఆర్‌టీ కార్నర్స్‌ను జిల్లాలోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

- వారం రోజుల పాటు నిర్వహణ
- రేపు రాత్రి 10.30 గంటలకు కల్యాణం




స్వామివారి కల్యాణోత్సవానికి సిద్ధం చేస్తున్న వేదిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు
- ఉత్సవాల నేపథ్యంలో దర్శన వేళల్లో స్వల్ప మార్పు, ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు వేకువజామున నాలుగు గంటల నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. రాత్రి 7 గంటలకు భక్తులకు దర్శనాలను నిలిపివేశాక ప్రధానాలయంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణము, ఉత్సవాంగీకారం జరుగుతాయి. అనంతరం చక్రపెరుమాళ్‌ను పల్లకీలోలో పుట్టబంగారం మండపానికి తీసుకువెళ్లి, మృత్సంగ్రహణం చేశాక అంకురార్పణలతో కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడతారు. 8వ తేదీ రాత్రి 10.30 గంటల నుంచి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం విశేష హోమాలు చేసేందుకు ఉత్తర రాజగోపురానికి సమీపంలో ప్రత్యేక యాగశాలను నిర్మించారు. మధ్యాహ్నం 3 గంటలకు కొట్నాల ఉత్సవం, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు ఆరాధన, విశేష హోమాలు, ధ్వజారోహణం, తిరువీధి, సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఎదురు సన్నాహోత్సవం, రాత్రి 7.30 నుంచి 8 గంటల వరకు స్వామివారిని రథంపై ఉంచి అలంకరణ, 8.15 నుంచి 9.30 వరకు మాడవీధుల్లో రథోత్సవం జరుపుతారు. ఆ తరువాత ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా తయారుచేసిన పుష్ప వేదికపై స్వామివారి వార్షిక తిరు కల్యాణాన్ని నిర్వహిస్తారు. 10న పండిత సద్యస్సాన్ని పురస్కరించుకుని సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలుడిగా అందంగా అలంకరించి సర్వజన మనోరంజని వాహనంలో అధిష్ఠింపజేసి మాడవీధుల్లో ... మిగతా 6వ పేజీలో


నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక

- అల్లూరి జిల్లా ఏజెన్సీలో రెండు రోజులపాటు పర్యటన
- తొలి రోజు డుంబ్రిగుడ మండలం పెదపాడు సందర్శన, గిరిజనులతో ముఖాముఖి
- సాయంత్రం మండల కేంద్రంలో సభ, 200 రోడ్ల నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన
- రేపు అరకులోయ మండలం సుంకరమెట్టలో చెక్క వంతెన ప్రారంభం



పాడేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ఏజెన్సీలోని డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు విశాఖ నుంచి పెందుర్తి, అనంతగిరి, అరకులోయ మీదుగా రోడ్డు మార్గంలో డుంబ్రిగుడ చేరుకుంటారు. చాపరాయి జలవిహారిలో మత్స్యాలమ్మను సందర్శిస్తారు. అనంతరం చాపరాయి గెడ్డ మీదుగా పెదపాడు పీవీటీజీ గ్రామానికి చేరుకుంటారు. పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను పరిశీలిస్తారు. గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. తరువాత డుంబ్రిగుడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. ఇక్కడ ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ... మిగతా 7వ పేజీలో

ఎవరా ఉన్నతాధికారి?



- ఆశీలును గెజిట్‌కి మించి వసూలు చేయడం లేదంటూ కాంట్రాక్టరుకు జోన్-4 కమిషనర్ వత్తాసు
- జడ్సీ మల్లయ్యనాయుడు వివరణపై సర్వత్రా విమర్శలు

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):

పూర్ణామార్కెట్‌లో ప్రైవేటు వ్యక్తి ఆశీలు వసూలు చేసుకునేందుకు ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చారంటూ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఇచ్చిన వివరణపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంట్రాక్టరును వెనకేసుకొచ్చేందుకే ఓ ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలు ఇచ్చారని చెప్పి, ఆ అధికారి పేరు చెప్పకపోవడం వెనక కాంట్రాక్టర్‌ను వెనుకేసుకు రావడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలుకు జీవీఎంసీ అధికారులు కొన్నాళ్ల కిందట వేలం నిర్వహించగా కూటమి చోటా నేత ఒకరు రూ.81 లక్షలకు పాడుకున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఆశీలు వసూలు చేసుకునేలా టెండరులో పేర్కొన్నప్పటికీ, సదరు వ్యక్తికి వర్క్ ఆర్డర్ ఇచ్చేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందాల్సి ఉంటుంది. స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందిన తర్వాత కమిషనర్ గెజిట్ విడుదల చేసి కాంట్రాక్టరుకు వర్క్ ఆర్డర్ జారీ చేస్తారు. అప్పటి నుంచి మాత్రమే కాంట్రాక్టర్ ఆశీలు వసూలు చేసుకునేందుకు వీలుంటుంది. అయితే జీవీఎంసీలో మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాసానికి కూటమి కార్పొరేటర్లు కలెక్టర్‌కు నోటీసులు జారీ చేయడంతో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహణకు అవకాశం లేకుండా పోయింది. అందువల్ల అప్పటివరకు ... మిగతా 6వ పేజీలో


మధురవాడ : టైలర్స్ కాలనీలో ఉత్సవ మూర్తులు


సింహగిరిలో వేదికపై లక్ష్మణ, హనుమ సమేత సీతారాములు


ఆనందపురం : గుడిలోవలో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాములోరి పెళ్లి..ఊరంతా సందడి

- నియోజకవర్గంలో శ్రీరామ నవమి వేడుకలు
- వైభవంగా సీతారాముల కల్యాణం
- చూసి తరలించిన భక్త జనం

సింహాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాములోరి కల్యాణంతో ప్రతి పల్లె మురిసింది.సింహగిరిపై ఈశాన్య దిక్కులోని గంగధార సమీపాన ఉన్న సీతారామస్వామి ఆలయంలో సింహాచలం దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు లక్ష్మణ, ఆంజనేయ సమేత సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనాలతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. తొలుత కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ కావించారు. అనంతరం ఈఓ సుబ్బారావు దంపతులు ముత్యాలు, పట్టువస్త్రాలను సమర్పించగా ఏఈఓ ఆనందకుమార్ కల్యాణోత్సవాన్ని జరిపించారు. మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అభిజిత్ లగ్నంలో స్వామివారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. అలాగే సింహగిరిపై స్వామివారి ప్రధాన రాజగోపురం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి పంచాయతన ఆలయంలో కూడా సీతారాముల కల్యాణం నిర్వహించారు. విజినిగిరిపాలెంలోని రామాలయం, కొండదిగువ కోమటి వీధిలోని రామాలయం, సింహాచలనగర్ (చాకిరేవు కొండ)లో, సింహపురి కాలనీలో, కాపు వీధిలో, పాత అడివివరంలోని పలు దేవాలయాల్లోనూ రాములోరి పెళ్లి వేడుకగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ పివి నరసింహం, టీడీపీ 98వ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్టీ గంట్ల శ్రీనుబాబు, జి. అవినాష్‌బాబు, రాజనాల సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని పలు రామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. సుభాష్ రోడ్‌లో వున్న వీరమట్టి రామ మందిరంలో యరబాల తాతారావు, కృష్ణవేణి దంపతులతో పురోహితులు సుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి, ఆలయ ప్రధానార్చకులు అగ్నిహోత్రం శ్రీరామాచార్యులు, కిరణ్‌కుమార్ శర్మ సీతారాములు కల్యాణం జరిపించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మేరువ కోదండ పోతరాజు, తులసి రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు. కొంకివీధి రామ మందిరంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, అప్పలనాయుడు దంపతులు, టీడీపీ నాయకులు గాడు సన్యాసినాయుడు, గొలగాని నరేంద్రకుమార్, అనవర్తి సూర్యప్రకాశరావు, రాసయ్య మాస్టారు పాల్గొన్నారు. రొట్టెలవీధిలో శ్రీకోటావారి రామ మందిరం, బోయవీధి రామ మందిరం, సోమన్నపాలెంలో, బీచ్‌రోడ్ రామాద్రిలో, వారిజ ఆశ్రమంలోనూ వేడుకలు వైభవంగా నిర్వహించారు.

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. టైలర్స్ కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయంలో ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మీ దంపతులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బంగారు అశోక్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.మానం ఆంజనేయనగర్‌లోని లలితాంబికా సమేత మహా కామేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది.

తగరపువలస : చిట్టివలస జూట్‌మిల్లు రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్. రాంబాబు, ఎ. నాగరాజు, జీరు వెంకటరెడ్డి, మాకల అప్పారావు, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లవలస రామాలయంలో ఉదయం నుంచి సీతారాములకు పూజలు, అభిషేకాలు జరిపారు.అనంతరం కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం నాలుగు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. తాటితూరు, చిప్పాడ, దాకమర్రి, మజ్జివలస, అమనాం గ్రామాల్లోనూ వేడుకలు జరిగాయి.


ఇస్కాన్‌లో సీతారాముల కల్యాణం


భీమిలి పట్టణంలోని వీరమట్టి శ్రీరామ మందిరంలో సీతారామ కల్యాణం

విశాలాక్షినగర్ : విశాలాక్షినగర్‌లో ఉన్న కోదండ సీతారామాలయ సముదాయంలో ఆలయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధన ఏర్పాటు చేశారు.పోలీసు క్వార్టర్స్ రోడ్డులో ఉన్న భక్తతుకారాం రామాలయంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతారామ కల్యాణం ఘనంగా జరిగింది. ఎస్సీ ఎస్టీ కాలనీలో ఉన్న రామాలయంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఎండాడ : ఎండాడ కోదండ రామాలయం, షిర్డీసాయి, గణపతి పశుపతినాథేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదురాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం జరిపారు.

ఆనందపురం : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుడిలోవ విజ్ఞాన విహార ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఉత్సవంలో 43 మంది దంపతులు పాల్గొని, కల్యాణం జరిపించారు. ఆనందపురం, పెద్దిపాలెం, వెల్లంకి, చందక, తర్లువాడ, గిడిజాల, గండిగుండం, రామవరం, కుసులువాడ, బోని, గొట్టిపల్లి, గంభీరం, శొంఠ్యాం పంచాయతీల్లోనూ పూజలు జరిగాయి.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయాలను పచ్చని తోరణాలతో అలంకరించారు. పొట్నూరులోని కోదండరామస్వామి ఆలయంలో అర్చకుడు ఏవీఆర్ఎస్ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, గెద్దపేట, బీఆర్ తాళ్లవలస, అయినాడ, రెడ్డిపల్లి, విలాస్‌ఖాన్‌పాలెం, మద్ది, పాండ్రంగిలోనూ సీతారాల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కృష్ణాపురం కాలనీలోని రామాలయ కమిటీ, మద్ది రామాలయం ఆధ్వర్యంలో సీతారాముల పల్లకీ ఉత్సవం జరిగింది.

సాగర్‌నగర్ : ఇస్కాన్‌లో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది.తొలుత సీతారామ, లక్ష్మణ,హనుమాన్ ఉత్సవ మూర్తులను మందిర ఆవరణలో మంగళవాయిద్యాలతో ఊరేగించారు. పండితులు వేద మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణం జరిపారు. వంద మంది దంపతులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవనిలు శ్రీరామ కథ ప్రవచనం చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాగర్‌నగర్ రామాలయంలోనూ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది.వందలాది మంది దంపతులు కల్యాణ ఘట్టాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

కొమ్మాది : శ్రీరాముడి జీవితం ఆదర్శనీయమని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. బొట్టవానిపాలెంలో జరిగిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. అలాగే చంద్రంపాలెం జాతరగుట్ట దుర్గాలమ్మ అమ్మవారి సన్నిధిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలోను, పీఎంపాలెం రామాలయం, షిర్డీసాయి ఆలయంలోనూ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ బొడ్డేపల్లి రాము, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మంచి ముత్యాలు, పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఈఓ సుబ్బారావు దంపతులు

రామతీర్థం ఉత్సవానికి అప్పన్న ఆలయం కానుకలు

సింహాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లాలోని రామతీర్థంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలకు సింహాచలం దేవస్థానం నుంచి పలు కానుకలను పంపించారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు నుంచి రామతీర్థంలోని రామన్నకు అప్పన్న ఆలయం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను కానుకగా తీసుకువెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ఈఓ సుబ్బారావు సారథ్యంలో మంచి ముత్యాలు, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామికి కల్యాణ వస్త్రాలను, వివిధ ఫలాలు, నృసింహ వనంలోని పరిమళభరిత సంపెంగ పుష్పాలను తీసుకువెళ్లారు. తొలుత సింహాద్రినాథుని సన్నిధిలో వాటిని ఉంచి పూజలు చేసిన తరువాత అర్చకులు, పండితులు, ఈవో దంపతులు మంచీ మార్బలంతో కలిసి తీసుకువెళ్లి రామతీర్థంలోని సీతారాముల కల్యాణోత్సవానికి సమర్పించారు.

వైష్ణవ స్వాముల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సింహాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 30న జరిగే వరాహలక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవంలో సహస్ర ఘట్టాభిషేకంలో తీర్థ కైంకర్యం చేయదలచిన శ్రీవైష్ణవ స్వాములు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ కె. సుబ్బారావు కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. దరఖాస్తు నమూనాను దేవస్థానం వెబ్‌సైట్ నుంచి లేదా దేవస్థానం కార్యాలయం పనివేళల్లో పొందవచ్చునని తెలిపారు.

తండ్రి చెంతకు చేరిన బాలిక

సాగర్‌నగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో తప్పిపోయిన బాలికను లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు ఆమె తండ్రి వద్దకు చేర్చారు. పంజాబ్ ప్రాంతానికి చెందిన హరమహేంద్రసింగ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. బీచ్‌లో రద్దీగా ఉండడంతో ఆయన కుమార్తె ప్రీతిసింగ్ (2) తప్పిపోయింది. బాలిక బీచ్‌లో ఏడుస్తూ లైఫ్‌గార్డులకు కనిపించడంతో వారు మెరైన్ పోలీసులు సహకారంతో ఆమె తండ్రికి అప్పగించారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌టీ కార్నర్స్

... 5వ పేజీ తరువాయి

కేంద్రాలు, 54 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 66 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల సిబ్బంది వీటిని ఏర్పాటు చేయగా, మిగిలిన వాళ్ల కూడా సోమవారం నాటికి ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశించారు. ఓఆర్‌టీ కార్నర్స్ నిర్వహణకు అనుగుణంగా పట్టణ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐదు వేల చొప్పున, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు వెయ్యి చొప్పున ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రానున్న మూడు నెలలపాటు ఈ కేంద్రాలు నడిచేలా సిబ్బందికి ఆదేశాలు అందాయి. తొలి దశలో ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌టీ కార్నర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎండ తీవ్రతను బట్టిరానున్న రోజుల్లో ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, అంగన్వాడీ కేంద్రాలతో పాటు ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కార్నర్స్ వద్ద తప్పనిసరిగా ఆరోగ్యశాఖకు చెందిన ఒక సిబ్బంది ఉంటారు. రోగులతో పాటు కార్నర్ వద్దకు వచ్చే ప్రజలకు వీటిని తప్పనిసరిగా అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు.

అందుబాటులో మరో 60 వేలు..

ప్రస్తుతం జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలకు సుమారు ఐదు లక్షల వరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అధికారులు పంపిణీ చేశారు. పెదవాల్తేరులోని సెంట్రల్ స్టోర్‌లో మరో 60 వేల వరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. కొద్దిరోజుల్లో జిల్లాకు మరో రెండు లక్షల వరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వస్తాయని వారు చెబుతున్నారు. వీటిని ఆయా కేంద్రాల అవసరాల మేరకు పంపిస్తామని, కొత్తగా ఏర్పాటు చేయబోయే కేంద్రాలకు కూడా సరఫరా చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజలకు ఆరోగ్యశాఖ సూచనలు..

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. అందరూ ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలని, లేత వర్ణం, తెల్లికైన, కాటన్ దుస్తులను ధరించాలని వెల్లడించారు. రోజూ కనీసం 15 గ్లాసుల నీటిని తప్పకుండా తాగాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, భోజనం మితంగా చేయాలని, మిట్టమధ్యాహ్నం వేళ ఇళ్లలోనే ఉండాలని తెలిపారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటి వాటిని ధరించాలని, ఇంట్లో కిటికీలను తెరిచి ఉంచాలని, సూర్య కిరణాలు, వేడి గాలులు తగలకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. పుట్‌పాత్‌పై విక్రయించే చల్లని, రంగు పానీయాలకు దూరంగా ఉండాలని, మాంసాహారాన్ని తగ్గించాలని, మద్యం సేవించకపోవడమే మేలని తెలిపారు. ఎండ వేళ శరీరంపై భారం పడే పనులకు దూరంగా ఉండాలని, నలుపు దుస్తులు, మందంగా ఉండే దుస్తులను ధరించకూడదని అధికారులు తెలిపారు.

డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

వేసవి దృష్ట్యా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా బయట పనిచేసే వాళ్లు, ప్రయాణాలు సాగించేవారు అప్రమత్తంగా ఉండాలి. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల మధ్య బయటకు రాకుండా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ఇలా చేస్తుండాలి. ఓఆర్‌టీ కార్నర్స్‌లో ఇచ్చే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని ప్రజలు వినియోగించుకోవాలి. దీనివల్ల శరీరం ఎండ వేడిమి వల్ల ఇబ్బందులకు గురికాకుండా ఉంటుంది.

ఎవరా ఉన్నతాధికారి?

జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలోనే ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఆశీలు వసూలు కాంట్రాక్టు దక్కించుకున్న కూటమి చోటా నేత తనకు ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని రుబాబు చేయడంతో పాటు జీవీఎంసీ అధికారులను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ఏప్రిల్ ఒకటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా సొంత మనుషులతో ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించారు. రోడ్డుపై జంగిడీలు పెట్టించి అధిక ఆశీలు వసూలు చేసుకుని జేబులు నింపుకునే ప్రయత్నం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమవ్వడంతో సీపీ శంఖబ్రత బాగ్చి స్వయంగా రంగంలోకి దిగి మార్కెట్ పరిసరాల్లో రోడ్ల ఆక్రమణలను పూర్తిగా తొలగించేశారు.

ఇదిలావుండగా పూర్ణామార్కెట్ ఆశీలు వసూలు దక్కించుకున్న కాంట్రాక్టరుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం లేదని చెబుతూనే ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలతో ఆశీలు, పార్కింగ్ ఫీజును కాంట్రాక్టర్ వసూలు చేసుకుంటారంటూ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఒక ప్రకటన జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే మౌఖిక ఆదేశాలిచ్చిన ఆ ఉన్నతాధికారి ఎవరనేది మాత్రం జడ్సీ చెప్పకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. పైగా రెవెన్యూ సిబ్బంది ద్వారా డిపార్టుమెంటల్ కలెక్షన్ చేయించాల్సింది పోయి ప్రైవేటు వ్యక్తి వసూలు చేసుకుంటున్నారని చెప్పడం జడ్సీ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు. పార్కింగ్ ఫీజును కాంట్రాక్టర్ రెండింతలు అధికంగా వసూలు చేస్తున్నాడని, జీవీఎంసీ లోగో, కమిషనర్ పేరుతో టోకెన్లు ప్రింటింగ్ చేయించి, కారు పార్కింగ్‌కు రూ.పదికి బదులుగా రూ.20, బైక్ పార్కింగ్‌కు రూ.ఐదుకి బదులుగా రూ.పది వసూలు చేస్తున్నట్టు ఆధారాలతో సహా పత్రికల్లో కథనాలు వచ్చినా, జడ్సీ మాత్రం గెజిట్ ప్రకారమే పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని, అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవం కాదంటూ కాంట్రాక్టరుకు వత్తాసు పలకడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని జీవీఎంసీ అధికారులే ఆశ్చర్యపోతున్నారు.

సివిల్ సప్లయ్ శాఖలో ఆ ఉద్యోగిదే పెత్తనం

... 5వ పేజీ తరువాయి

పలు వీధులకు రైస్ బండి వెళ్లడం లేదని, వెంటనే స్పందించకపోతే జేసీతో చెప్పించి డీలర్/ఎండీయూను సస్పెండ్ చేస్తామని ఎమ్మెల్యే గారు చెప్పారు' అంటూ ఆడియో మెసేజ్ పెట్టారు. సెలవులో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ లేనిపోని పెత్తనం చేస్తున్నారని డీలర్లు/ఎండీయూలు వ్యాఖ్యానిస్తున్నారు. సెలవులో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారని, ఈ విషయం ప్రస్తుత ఇన్‌స్పెక్టర్‌కు తెలుసునని పేర్కొంటున్నారు. గతంలో విధులు నిర్వహించినప్పుడు కూడా ఈయన పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పెత్తనం చెలాయించేవారని డీలర్ల సంఘం నేత ఒకరు తెలిపారు. గతంలో పనిచేసిన డీఎస్‌వో దన్నుతో తానే డీఎస్‌వోనన్న దర్పం చూపుతూ కొందరు ఇన్‌స్పెక్టర్లతో కలిసి భారీగా వసూళ్లకు పాల్పడేవారని ఆరోపించారు. సెలవులో ఉన్నప్పటికీ సదరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్ డీలర్లు/ఎండీయూ వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టులు పెట్టడం గురించి అధికారులకు తెలిసినా ఎందుకు మౌనం దాల్చుతున్నారో అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానించారు.

పాలిసెట్ ఉచిత శిక్షణ

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశానికి పరీక్ష రాయనున్న విద్యార్థులకు సోమవారం నుంచి అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా పేర్లు నమోదు చేసుకునే దూర ప్రాంతాల వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం మెటీరియల్ కూడా అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో, పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండపంలో ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చనతో స్వామివారికి స్వర్ణ పుష్పాలతో అర్చనలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన దంతులూరి భాస్కరరాజు,పద్మజ దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను వారు నగదు రూపంలో ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి సి. పద్మనాభరాజు (విక్రమ్)కు ఆదివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేష వస్త్రంతో సత్కరించారు.

తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలిపై కేసు

గాజువాక, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మిపై గాజువాక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.వారు తెలిపిన వివరాలు ప్రకారం.. నాతయ్యపాలెం ప్రాంతానికి చెందిన పి.నరేశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ,ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతను ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి,తమ వద్ద లక్షల్లో నగదు తీసుకున్నాడని గత నెల 2న అనంతలక్ష్మి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజున పోలీసులు నరేశ్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఎస్‌ఐ అతనితో మాట్లాడుతుండగా అనంతలక్ష్మి పోలీసుల ఎదుటే చెప్పు తీసి నరేశ్‌ను కొట్టారు. ఈ విషయమై నరేశ్ సీపీకి ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు గాజువాక పోలీసులు అనంతలక్ష్మిపై కేసు నమోదు చేశారు. గాజువాక సీఐ పార్థసారధిని కూడా అనంతలక్ష్మి అసభ్య పదజాలంతో దూషించారని పోలీసులు తెలిపారు. కాగా ఉద్యోగాల కల్పనలో భాగంగా నగదు విషయమై ఇద్దరి మధ్య గతంలో కూడా వివాదం నడిచింది.

కొట్లాటలో తొమ్మిది మందిపై కేసు నమోదు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణంరాజుపేటలో గోడ విషయమై ఇరువర్గాల మధ్య శుక్రవారం జరిగిన కొట్లాటకు సంబంధించి తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని సీఐ తిరుమలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. ఒకే కుటుంబానికి చెందిన వారు ఇంటి సమీపంలో ఉన్న గోడ తమదంటే తమదని గొడవపడి కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన సురాల అచ్చిబాబు, బోని సన్యాసినాయుడు, డొకర అప్పలనాయుడు, డొకర సాయి గాయపడడంతో వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒక వర్గానికి చెందిన డొకర లక్ష్మి ఫిర్యాదు మేరకు సురాల అచ్చిబాబు, మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మరో వర్గానికి చెందిన సురాల అచ్చిబాబు ఫిర్యాదు మేరకు డొకర అప్పలనాయుడు, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాధాకృష్ణ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

భీమునిపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మూడు, నాలుగు వార్డుల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గాడువీధిలో వున్న కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనరు కె. రామానాయుడు పార్టీ జెండాను ఎగురవేసి, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు.

సింహాచలం : బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి వేదుల దక్షిణామూర్తి పిలుపునిచ్చారు. ఆయన సింహాచలం మండల బీజేపీ అధ్యక్షుడు రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో సింహాచలం ప్రధాన కూడలిలో జరిగిన వేడుకల్లో మాట్లాడారు.

తగరపువలస : తగరపువలస కూడలిలో బీజేపీ నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1, 2 వార్డుల బీజేపీ అధ్యక్షుడు చిల్ల త్రినాథరెడ్డి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభక్త రామానాయుడు, జీరు వెంకట కైలాస్, రాము, విజయ్ పాల్గొన్నారు.

పద్మనాభం/పద్మనాభం రూరల్ : పద్మనాభంలోని బీజేపీ కార్యాలయం వద్ద నాయకులు ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు బి. పద్మనాభం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల హవా!

... 5వ పేజీ తరువాయి

మరొకరికి అప్పగించారు. దీనిపై డ్వాక్రా సంఘం కోర్టుకు వెళ్లడంతో మరో డీలర్‌కు అటాచ్ చేసే వ్యవహారంలో సెలవులో ఉన్న ఇన్‌స్పెక్టరు తాజాగా పంచాయితీ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. కొందరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు నగరంలో ఏళ్లతరబడి కొనసాగుతున్నారు. పైరవీలు సాగిస్తూ మాతృశాఖ రెవెన్యూకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు.రాజకీయ నేతల సిఫారసులు, రెవెన్యూ సంఘం జోక్యంతో పౌరసరఫరాల శాఖలోనే కొనసాగడానికి వారు మొగ్గు చూపుతున్నారు. ఇదిలావుండగా రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల నుంచి ఇన్‌స్పెక్టర్లకు నెలవారీ మామూళ్లు అందుతాయన్నది బహిరంగ రహస్యం. ఒరిజినల్ డీలర్ రూ.1000, ఎండీయూ రూ. 500, బినామీ డీలర్ రూ.2 వేల వరకు సమర్పించుకుంటారనే ఆరోపణలున్నాయి. ప్రొటోకాల్ ఖర్చుల కోసమంటూ వసూలు చేస్తున్నారని గాజువాకకు చెందిన డీలర్లు చెబుతున్నారు. ప్రతి రెండేళ్లకు (2025 ఏప్రిల్ ఒకటి నుంచి 2027 మార్చి 31 వరకు) ఒకసారి ప్రతి రేషన్ డిపోను అథంటికేషన్ చేసుకోవాలి.అంటే డీలర్ ఒరిజినల్ ఆర్డర్, రూ.500 చలానా, దరఖాస్తు పూర్తి చేసి పౌరసరఫరాల శాఖకు అందజేయాల్సి ఉంటుంది. దీనికి కూడా కొందరు ఇన్‌స్పెక్టర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని వన్‌టౌన్‌కు చెందిన పలువురు డీలర్లు చెబుతున్నారు. కాగా నగరం నుంచి వేల టన్నుల బియ్యం శివారుప్రాంతాలకు తరలిపోతుంటాయి. వీటిని పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టుకుని పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తుంటారు. ఈ పని చేయాల్సిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రం బియ్యం అక్రమ తరలింపుదారుల నుంచి భారీగా వసూలు చేస్తుంటారని సమాచారం.

15 సెల్‌ఫోన్లు స్వాధీనం

తగరపువలస, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కేవీఆర్ లేడీస్ హాస్టల్‌లో చోరీ అయిన 13 సెల్‌ఫోన్లను భీమిలి పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సూర్యప్రకాశరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 1వ తేదీ రాత్రి 2 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు హాస్టల్‌లో ప్రవేశించి 13 సెల్‌ఫోన్లు చోరీ చేశారని రేవళ్ల అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సిసి పుటేజీల ఆధారంగా నలుగురు మైనర్లను గుర్తించి, పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 13 హాస్టల్‌లో ఉంటున్న వారివి కాగా మిగిలిన రెండు భోగాపురం స్టేషన్ పరిధిలో అమ్మ హాస్టల్ నుంచి దొంగతనం చేశామని బాలురు తెలిపారు.

అలరించిన కోలాటం

మధురవాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి పురస్కరించుకుని శిల్పారామంలో మధురవాడకు చెందిన శ్రీలక్ష్మీ నరసింహ కోలాట బృందం ప్రదర్శన ఇచ్చింది. పలు కీర్తనలకు సంతోషి, మంగదివ్య, హేమ, అఖిలేశ్వరి, కామేశ్వరి, కారుణ్య, దీపిక, సులక్షణ, హిమబిందు నృత్యాలు చేశారు.

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

... 5వ పేజీ తరువాయి

ఊరేగిస్తారు. స్వామివారు స్వర్ణనారసింహ కవచంలో భక్తులకు దర్శనమిస్తారు. 11న సాయంత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తారు. 12వ తేదీ వేకువజామున 3 గంటలకు సుప్రభాతసేవ చేశాక ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, తిరువీధి, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు మృగయోత్సవం (దొంగలదోపు ఉత్సవం), అశ్వవాహనంపై తిరువీధి, ధ్వజారోహణం జరుగుతాయి. 13వ తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 8 నుంచి వినోదోత్సవం (ఉంగరపు సేవ) నిర్వహిస్తారు.

దర్శన వేళల్లో మార్పు

వార్షిక తిరు కల్యాణం, నిజరూప దర్శనం చందనోత్సవాలను పురస్కరించుకుని సింహాచలేశుని దర్శన వేళల్లో స్వల్ప మార్పు చేయడంతో పాటు ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈనెల 7 నుంచి 14 వరకు వేకువజామున జరిగే సుప్రభాతసేవ, ఉదయం, రాత్రి ఆరాధన సేవ టికెట్ల విక్రయాలను రద్దు చేశారు. 7వ తేదీ నుంచి 14 వరకు రాత్రి 7 గంటల తరువాత భక్తులకు దర్శనాలు లభించవు. అలాగే 7 నుంచి 23వ తేదీ వరకు ఆలయంలో జరిగే నిత్య కల్యాణం, స్వర్ణ పుష్పార్చన, సహస్రనామార్చన, గరుడసేవ, తదితర అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేశారు. 13న స్వామివారి శ్రీపుష్పయాగాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి.



ఎంవీపీ కాలనీ : ఐదో సెక్టరులో సీతారామ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు



వెంకోజీపాలెం : పాత వెంకోజీపాలెం సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఎంవీపీ కాలనీ : శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిర్‌లో సీతారాముల కల్యాణోత్సవం



వెంకోజీపాలెం : పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న గ్రామస్థులు

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

» భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి » రామాలయాల్లో సందడిగా కల్యాణోత్సవాలు » పలు చోట్ల అన్నసమరాధనలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 15వ వార్డు పరిధి పాత వెంకోజీపాలెంలోని వేంచేసి ఉన్న శ్రీహనుమత్ సీతారామ లక్ష్మణుల ఆలయ సముదాయంలో ఆదివారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో ఆలయంలో ప్రధానార్చకులు రంపా రామ్మోహన్ శర్మ, రంపా మురళి శర్మలు భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సీతారాములకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భద్రాది రాముని కల్యాణ మహోత్సవం ముహూర్తానికే (ఉదయం 11 గంటల 52 నిముషాలకు) సీతారాముల కల్యాణం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట సూర్యఅప్పారావు దంపతులు ఈ కల్యాణంలో పాల్గొని సంఘం ఆధ్వర్యంలో దాతల సాయంతో శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు మంగళసూత్రాలను సమర్పించారు. భద్రాది రామయ్యకు నిర్వహించే విధంగా ఇక్కడ కల్యాణం జరిపారు. ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాల మధ్య సంఘం చేకూర్చిన తాళిబొట్టును సీతమ్మవారికి అలంకరించారు. పట్టువస్త్రాలతో సీతారాములను అలంకరించారు. వివిధ పూలతో ఆలయ ప్రాంగణాన్ని కల్యాణ మండపంగా రూపుదిద్దారు. తొలుత పట్టు వస్త్రాలను భారీ భజంత్రీలతో మంగళవాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, ఆర్య కనస్ట్రక్షన్స్ డీఎస్ ఎన్. రాజు దంపతులు, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య దంపతులు, ఏయూ మాజీ వీసీ జీఎస్ఎన్ రాజు దంపతులు, పలువురు ప్రముఖులు పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో సుమారు 5000 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం హనుమత్ సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాలు, బాణసంచాతో సాగిన ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రామకీర్తనలు ఆలపించారు. అనంతరం ఇక్కడ జరిగిన పరస మహోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, జనసేన నాయకులు పీల వెంకట పరదేశినాయుడు, సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, ఉపాధ్యక్షులు పెంటకోట ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శి కర్రి రవికుమార్, కోశాధికారి యల్లపు శ్రీను, సహాయ కార్యదర్శులు కర్రి రఘు, రాజగిరి సతీష్, పెంటకోట నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి ఆడారి శివప్రకాష్, ఆడిటర్ కాళ్ల రాజేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

కేఆర్ఎం కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో వైసీపీ తూర్పు పరిశీలకులు మొల్లి అప్పారావు పాల్గొని భక్తులకు అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త వెంకోజీపాలెంలోని జాతీయ రహదారికి ప్రక్కనున్న శ్రీసీతారాముల ఆలయంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు దంపతులతో పాటు గ్రామంలోని దంపతులు పాల్గొని శ్రీసీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు.

ఇసుకతోటలో వేంచేసి ఉన్న రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.శ్రీ సీతారామ సేవామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో పలువురు జంటలు పాల్గొని కల్యాణం నిర్వహించుకున్నారు. ఇసుకతోట కృష్ణ మందిరంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీసీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు బంతి భోజనాలు నిర్వహించారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, : శ్రీరామన నవమి సందర్భంగా వివిధ ఆలయాలు, కాలనీల్లో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. ఎంవీపీ కాలనీ అయిదో సెక్టరులో స్థానిక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన సీతారాముల కళ్యాణంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు పాల్గొని, పూజలు చేశారు. శ్రీసత్యసాయి విద్యా సంస్థల ప్రాంగణంలోని ప్రేమసదన్ మందిర్‌లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సీతారామరాజు, శ్రీసత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు నాయుడు, భారీగా సత్యసాయి భక్తులు పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి, వేంకటేశ్వర ఆలయంలో సీతారాముల కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం పానకం, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రుల కళ్యాణోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో సీతారామ కళ్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. అలాగే 10వ వార్డులో గల పాత డెయిరీ ఫారం సమీపంలో గల రాజీవ్‌నగర్‌గల లక్ష్మీనారాయణ ఆశ్రమంలో వెలసిన లక్ష్మీనారాయణ ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాలిసేట కొండవాలు ప్రాంతంలో గల ఈశ్వరదేవీనగర్, చినగదిలి, ఆదర్శనగర్, పెదగదిలి, పైనాపిల్ కాలనీ, ఆరిలోవలోని రామాలయాలు, ఆదర్శనగర్ సాయిబాబా ఆలయం ఈ సందర్భంగా పలు చోట్ల అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. అన్ని ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు.

సిరిపురంలో..

సిరిపురం : శ్రీరామనవమి వేడుకల్లో వీఎంఆర్డీఏ ప్రణవ్‌గోపాల్ పాల్గొన్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లోని నిర్వహించిన వేడుకల్లో ఆయన పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ది అడ్రస్ గేటెట్ కమ్యూనిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాముని ఆలయంలో కల్యాణంలో పాల్గొన్నారు. ఏలియన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో జరిగిన కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అక్కయ్యపాలెం లారీ యాజమానుల సంఘం ప్రతినిధి సతీశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని పానకం, వడపప్పు, ప్రసాదం పంపిణీలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుతో కలిసి పంపిణీ చేశారు. మాధవధారలోని సీతా రామాంజనేయ ఆలయంలో సీతరాముని కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పాత డెయిరీ ఫారం సమీపంలోని రాజీవ్‌నగర్‌లోని లక్ష్మీనారాయణ ఆశ్రమంలో సీతారామ కళ్యాణోత్సవం



సిరిపురం : వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న అడ్రస్ గేటెట్ కమ్యూనిటీ సభ్యులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ నేతలు

పెదవాల్తేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం నగర బీజేపీ కార్యాలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యుడు పి.విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథ రాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రాజకీయాలలో అవినీతిని తొలగించడానికి బీజేపీ అవిర్భవించిందన్నారు. పార్టీ అవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 6 నుంచి 14వ తేదీ వరకూ అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంత్యోదయ స్ఫూర్తితో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దశగా బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు, దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్.విజయానంద రెడ్డి, బీజేపీ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి బొండాడ నరేంద్ర, పార్టీ నేతలు ప్రకాష్, కె.సుహాసిని ఆనంద్, బుద్ధ లక్ష్మీనారాయణ, వెంగమాంబ శ్రీనివాసబాబు, జె.దామోదర్ యాధవ్, పోలిమేర శ్రీనివాసరావు, ఎన్‌వీఎస్ దీలీప్ వర్మ, శ్రీరంగం దనేశ్వరరావు, జిల్లా పదారికారులు, మోర్చా అధ్యక్షులు, అసెంబ్లీ కన్వేనర్లు, మండల అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బస్ స్టేషన్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యం : ఆర్టీసీ ఆర్ఎం

ద్వారకా బస్‌స్టేషన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా అన్ని బస్‌స్టేషన్లు పరిశుభ్రంగా ఉండాలని, అందుకు డిపోమేనేజర్లు తగు చర్యలు తీసుకోవాల ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు స్పష్టం చేశారు. మద్దిలపాలెం బస్‌స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల సముదాయం, వాటర్‌ప్లాంట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ బస్సులు, స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పరిశీలించాలని సూచించారు. బస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు కూడా పరిశుభ్రతనే కోరుకుంటున్నారన్నారు. స్టేషన్‌లో ఉన్న స్టాల్ అన్నింటి వద్దా డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని, అందుకు సాళ్ల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు.విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ మేనేజర్ మాధురి,స్టేషన్ మేనేజర్ మూర్తి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు(నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 24, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి)100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవం సందర్భంగా జీవీఎంసీ 15వ వార్డు శాఖ ఆధ్వర్యంలో సింహాద్రిపురం, నరసింహనగర్ కొండవాలు ప్రాంతాల్లు ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో క్లినిక్ సిబ్బందితో స్థానికులకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాలతో పాటు ఒక మనిషిని వేరొక మనిషి దోపిడీ చేసే వ్యవస్థ నిర్మూలన కోసం, స్వాతంత్ర్యం సాధించడం కోసం జరిగిన పోరాటం, అనేక కుట్ర కేసులతో ఎందరో నేతలు జైలు జీవితాలను గడిపిన, దేశ సమైక్యత, సమగ్రత కోసం తమ రక్తాన్ని త్యాగం చేసి యాకరణ, రాజభరణాల రద్దు, ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపనలో సీపీఐ కృషి ఉందన్నారు. దున్నేవానికి భూమి పేరుతో పోరాటాలు చేసి లక్షల ఎకరాల పంచిన చరిత్ర సీపీఐకి కలదన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లయినా, దేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్ల పూర్తి చేసుకున్నా దేశంలో చెప్పుకోదగిన మార్పులు ఏమీ రాలేదని, నాడు బ్రిటీష్ వారు దోచుకుంటే నేడు మోదీ ముసుగులో అంబానీ, అదాని, వేదాంత వంటి కార్పొరేట్ సంస్థల పెట్టుబడిదారులు దోచుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పడాల గోవింద్, ఎన్.మధురెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, టీడీపీ 15వ వార్డు బుగత సత్యనారాయణ, లక్ష్మీనరసింహనగర్ అధ్యక్షులు కాళ్ల నరసింగరావు, ఏఐవైఎఫ్ అధ్యక్షులు రావి అశోక్, వైద్యులు డాక్టర్ కీర్తి, మాలతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వ హిస్తున్న దృశ్యం

షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నసంతర్పణ

మద్దిలపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పురస్కరించుకుని శివాజీపాలెం షిర్డీసాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణా సేవా సంఘం నాయకులు ఆధ్వర్యంలో అన్నప్రసాద సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దువ్వి నాగరాజు, కొర్రాయి రమేష్, శ్రీనివాసరావు, వెంకటరమణమూర్తి, సంతోష్‌కుమార్, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, పెనల శ్రీను పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక

... 5వ పేజీ తరువాయి

సుమారు 200 రోడ్ల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేస్తారు. రాత్రికి అరకులోయ చేరుకుని ఏపీటీడీసీ అతిథిగృహంలో బస చేస్తారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అరకులోయ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి ఇదే మండలం సుంకరమెట్ట సమీపంలోని కాఫీ తోటలకు చేరుకుంటారు. అటవీశాఖ చెక్కలతో నిర్మించిన కాలిబాట వంతెనను ప్రారంభిస్తారు. అనంతరంవిశాఖపట్నం పయనమవుతారు. డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎస్పీ అమిత్ బర్ధార్ పర్యవేక్షిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో సోమవారం చాపరాయి జల విహారిలో పర్యాటకుల ప్రవేశాన్ని రద్దు చేసినట్టు అధికారులు వెల్లడించారు.



భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

కన్నుల వైభోగం..కోదండరాముని కల్యాణం


అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో రాములోరి కల్యాణానికి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం


కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు


వన్‌టౌన్ ఘోషాసుపత్రి సమీపంలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు

మహారాణిపేట/డాబాగార్డెన్స్/అక్కయ్యపాలెం/సీతమ్మధార/మురళీనగర్/కంచరపాలెం/అల్లిపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాములోరి పెళ్లికి ఊరంతా పెద్దలే అన్నట్లు ఆబాలగోపాలం రాముల వారి సేవలో మునిగితేలారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లోనూ, చలువ పందిళ్ల కింద రాములోరి కల్యాణోత్సవాలను వేలాదిమంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా జరిపించారు. వందలాదిమంది దంపతులు పెళ్లి పెద్దలుగా కూర్చున్నారు. జైశ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి. వేద పండితులు సీతారామచంద్రస్వాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేక వేదికపై మంత్రోచ్చారణలతో ఆసీనులను చేసి సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువును జరిపించారు. ప్రతి ఘట్టం, దాని వెనుక ఉద్దేశాన్ని భక్తులకు వివరించారు. ప్రజల నడవడిక, బాధ్యతల నిర్వహణను చాటిచెపుతుందని పేర్కొన్నారు. పెద్దఎత్తున అన్న సమారాధనలు, వడపప్పు, పానకం, మజ్జిగ పంపిణీ జరిగింది. మహారాణిపేటలోని అంబికాబాగ్‌లో ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కె.శోభారాణి ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లగా కల్యాణ వేడుకను రమణీయంగా నిర్వహించారు. సహాయ కార్యనిర్వహణ అధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. సుమారు 53 సంవత్సరాల చరిత్ర కలిగిన పాత జైల్‌రోడ్డు గొల్లలపాలెం సీతారామాంజనేయ దేవాలయంలో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వేడుక జరిగింది. డాబాగార్డెన్స్‌లో శివరామకృష్ణ దేవాలయంలోని రామాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కన్నుల పండువగా వేడుకలు జరిగాయి. ఈవో జీవీ రమాబాయి, ఎం.మన్మథరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్కయ్యపాలెంలోని సాలిగ్రామపురం, దొండపర్తి ప్రాంతాల్లో భక్తులు తండోపతండాలుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ ఛైర్‌పర్సన్ ప్రణవ్ గోపాల్ పానకం పంపిణీ చేశారు. గోలీలపాలెంలోని రామాలయంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కంచరపాలెం, తిక్కవానిపాలెం, రెడ్డికంచరపాలెం, గొల్ల కంచరపాలెం, ఆర్పీపేట, తుమ్మడిపాలెం, సూర్యనగర్ ఆలయాల్లో కల్యాణక్రతువు సంప్రదాయబద్ధంగా జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మురళీనగర్, మాధవధార, బర్మాక్యాంప్, సూర్యానగర్ ఆలయాల్లో భక్తులు కల్యాణ వేడుకలను వీక్షించారు. నక్కవానిపాలెం సీతారాముల ఆలయంలో నవమి పూజలను, కల్యాణ ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వాములకు వేద మంత్రాలతో అర్చకులు పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు తెచ్చిన సారెను తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ కమిటీ పర్యవేక్షణలో సుమారు 2,500 మంది భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. చైతన్యనగర్‌లో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించారు. అల్లిపురంలోని బంగారుమెట్ట రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట, అస్సాంగార్డెన్స్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సీతమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. వైర్లెస్ కాలనీ, కుమ్మరవీధి, వెంకటేశ్వరమెట్ట, అచ్చియ్యమ్మపేటలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.


నక్కవానిపాలెంలో సారె ఊరేగింపు


అలంకరణలో సీతారామలక్ష్మణమూర్తులు


డాబాగార్డెన్స్ శివరామకృష్ణ దేవాలయంలోని రామాలయంలో కల్యాణ ఉత్సవంలో పాల్గొన్న దంపతులు


మురళీనగర్ హైస్కూలు సమీపంలోని ఆలయంలో కల్యాణ రాముడు


కంచరపాలెంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కార్ల షోరూమ్‌లో అగ్నిప్రమాదం

మర్రిపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ హోటల్ సమీపంలో ఉన్న ఓ కార్ల షోరూంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగడంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షోరూంలోని స్టోర్ రూమ్‌లో ఉదయం ఒక్కసారిగా పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. గమనించిన కాలనీవాసులు భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చి, షోరూం సెక్యూరిటీవారికి విషయం తెలియజేశారు. స్టోర్ రూం తాళం లేదని, నిర్వాహకులు కూడా లేరని వారు బదులివ్వడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. స్టోర్ రూం వెనుక ఉన్న విద్యుత్ తీగలపై పక్షులు వాలి రెండువైర్లు తగిలి మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. సుమారు రూ 50 వేల వరకు ఆస్తినష్టం ఉంటుందని తెలిపారు. ఇకపై స్టోర్ రూంను ఉపయోగించవద్దని నిర్వాహకులకు తెలిపినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.


షోరూమ్ స్టోర్ గది నుంచి వెలువడుతున్న పొగలు

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలిపై కేసు నమోదు

గాజువాక, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మిపై గాజువాక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాతయ్యపాలెం ప్రాంతానికి చెందిన పి.నరేశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ, ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతను ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి, తమ వద్ద రూ.లక్షల్లో నగదు తీసుకున్నాడని గత నెల 2న అనంతలక్ష్మి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజున పోలీసులు నరేశ్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఎస్‌ఐ అతనితో మాట్లాడుతుండగా అనంతలక్ష్మి పోలీసుల ఎదుటే చెప్పు తీసి నరేశ్‌ను కొట్టారు. ఈ విషయమై నరేశ్ సీపీకి ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు గాజువాక పోలీసులు అనంతలక్ష్మిపై కేసు నమోదు చేశారు. గాజువాక సీఐ పార్థసారధిని కూడా అనంతలక్ష్మి అసభ్య పదజాలంతో దూషించిందని పోలీసులు తెలిపారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా నగదు విషయమై ఇద్దరి మధ్య గతంలో కూడా వివాదం నడిచింది.

కేజీహెచ్‌లో అనుమానాస్పద స్థితిలో వార్డుబాయ్ మృతి

మహారాణిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ప్రాంతానికి చెందిన ప్రశాంత్ కుమార్ (22) కేజీహెచ్‌లో వార్డు బాయ్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున అత్యవసర చికిత్సా విభాగంలో టాయిలెట్‌లో ఇంజక్షన్‌లు తీసుకొని మృతి చెంది ఉంటాడని అనుమానించిన ఆసుపత్రి అధికారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోతాదుకు మించి డ్రగ్స్ తీసుకోవటమో లేదా ప్రేమ వ్యవహారంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే విషయం తెలియాల్సి ఉంది. అవుట్ సోర్సింగ్ విభాగంలో వార్డుబాయ్‌గా పనిచేసేవాడు. కుటుంబ సభ్యులతో కలసి ఆరిలోవలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యాడు, రాత్రి రెండు గంటల వరకు ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వహించాడు. అనంతరం తోటి ఉద్యోగులు విశ్రాంతి తీసుకోగా, ప్రశాంత్ కుమార్ సమీపంలో ఉన్న టాయిలెట్ లోపలకి వెళ్లాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఎవరో టాయిలెట్‌కు వెళ్లగా లోపల గడియ పెట్టి ఉంది. ఎంతసేపటికి బయటకు రాకపోవటం, లోపల నుంచి స్పందన లేకపోవటంతో తలుపు బలవంతంగా తెరిచారు. లోపల కూర్చొని ఎలాంటి చలనం లేకుండా పడి ఉండడంతో ఆసుపత్రి ఉన్నతాధికారులు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్‌లు హుటాహుటిన అక్కడకు చేరుకొని పరిశీలించారు. రెండు సిరంజ్‌లతో ఇంజక్షన్ చేసుకొని ఉండటాన్ని గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.


మృతి చెందిన ప్రశాంత్‌కుమార్

'అవినీతి నిర్మూలనకే బీజేపీ ఆవిర్భావం'

సీతమ్మధార, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అవినీతిని రూపుమాపేందుకే బీజేపీ ఆవిర్భవించిందని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు, సీనియర్ నాయకులు సనపాల రామృష్ణ, ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ సురేష్‌బాబు తదితరులు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి మిఠాయి తినిపిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్‌రాజు

టీ 20 క్రికెట్ ఫైనల్స్‌కు గౌరీ యూత్, శారద సీసీ

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): యూఎఫ్‌యూ టీ 20 క్రికెట్ టోర్నీలో గౌరి యూత్ సిసి, శారద సిసిజట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం హిందుస్తాన్ జింక్‌గ్రౌండ్‌లో జరిగిన తొలి సెమీస్‌లో శారదసిసి 24 పరుగులతేడాతో పెంటమాంబ సిసిపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శారద సిసి 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 118 పరుగులు చేసింది. పెంటమాంబ బౌలర్లలో వెంకట నాగప్రసాద్, నరేష్ రాజ్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో పెంటమాంబ సిసి 16.4 ఓవర్లలో 88 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. మరో సెమీఫైనల్స్ మ్యాచ్‌లో గౌరీ యూత్ రెండు వికెట్ల తేడాతో ఉషోదయ సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉషోదయ సిసి నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 150 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గౌరీ యూత్ 19.4 ఓవర్లలో ఎనిమిది వికెట్లు నష్టపోయి 152 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది.

27న ఉత్తరాంధ్ర రజకుల అభినందన సభ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర రజకుల అభినందన సభ ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము తెలిపారు. స్థానిక శివశంకర్ ఫంక్షన్ హాల్లో రజక సంఘాల సమాఖ్య ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రాజమండ్రి నారాయణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉపాధి లేక జీవనోపాధికి నానా అవస్థలు పడ్డారన్నారు. 90 శాతం రజకులు టీడీపీలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డూరు శంకర్, పి.గురునాథరావు, చీపురుపల్లి స్వరూప్ పాల్గొన్నారు.

వచన కవితా సంపుటి ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, కమల్‌బైద్, ఎం.సుబ్బారావు తదితరులు

సీతంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళావేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ నండూరి రామకృష్ణ రాసిన 'సామాజిక నిత్య హితోక్తులు 3వ వచన కవితా సంపుటి'ని ఆదివారం ఆవిష్కరించారు. కళావేదిక పుస్తకాలయం గౌరవ అధ్యక్షుడు కమల్ బైద్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.సుబ్బారావు పుస్తకాన్ని విశ్లేషించారు. విశిష్ట అతిథులుగా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్-1 అధ్యక్షులు జి.తనూజారెడ్డి, జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కళావేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.రజనీ, కార్యదర్శి అరుణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తి తీర్చేందుకు గోలీ సోడాల పంపిణీ

సీతమ్మధార, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు గోలీ సోడాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నక్కవానిపాలెం శివాలయం ఎదురుగా లక్కీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు బండారు గుప్తాజీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సుమారు 2,500 గోలీ సోడాలు పంపిణీ చేయడం విశేషమని కొనియాడారు. రాజేష్ రెడ్డి, పైడిరాజు, శ్రీనివాస్ రెడ్డి, మురళీ, పవన్, గోవింద్, పండు, గణేష్, చిన్న, డివిఎస్ ప్రసాద్‌రెడ్డి, కోన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ పార్కు అభివృద్ధికి త్వరలో నిధులిస్తాం: జడ్సీ

మురళీనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్ పార్క్ అభివృద్ధికి సహకరిస్తామని జోన్-5 జెడ్సీ బి.రాము పేర్కొన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్ నవీకరణ, కొత్త పనులకు నిధులు త్వరలో అందిస్తామన్నారు. ఆదివారం పార్కులో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ జెడ్సీని సత్కరించారు. వ్యవస్థాపకుడు ఎన్.బుచ్చయ్య, కార్యవర్గ సభ్యులు, పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

... 5వ పేజీ తరువాయి

ఊరేగిస్తారు. స్వామివారు స్వర్ణనారసింహ కవచంలో భక్తులకు దర్శనమిస్తారు. 11న సాయంత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తారు. 12వ తేదీ వేకువజామున 3 గంటలకు సుప్రభాతసేవ చేశాక ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, తిరువీధి, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు మృగయోత్సవం (దొంగలదోపు ఉత్సవం), అశ్వవాహనంపై తిరువీధి, ధ్వజారోహణం జరుగుతాయి. 13వ తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 8 నుంచి వినోదోత్సవం (ఉంగరపు సేవ) నిర్వహిస్తారు.

దర్శన వేళల్లో మార్పు, ఆర్జిత సేవలు రద్దు

వార్షిక తిరు కల్యాణం, నిజరూప దర్శనం చందనోత్సవాలను పురస్కరించుకుని సింహాచలేశుని దర్శన వేళల్లో స్వల్ప మార్పు చేయడంతో పాటు ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈనెల 7 నుంచి 14 వరకు వేకువజామున జరిగే సుప్రభాతసేవ, ఉదయం, రాత్రి ఆరాధన సేవ టికెట్ల విక్రయాలను రద్దు చేశారు. 7వ తేదీ నుంచి 14 వరకు రాత్రి 7 గంటల తరువాత భక్తులకు దర్శనాలు లభించవు. అలాగే 7 నుంచి 23వ తేదీ వరకు ఆలయంలో జరిగే నిత్య కల్యాణం, స్వర్ణ పుష్పార్చన, సహస్రనామార్చన, గరుడసేవ, తదితర అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేశారు. 13న స్వామివారి శ్రీపుష్పయాగాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల హవా!

... 5వ పేజీ తరువాయి

మరొకరికి అప్పగించారు. దీనిపై డ్వాక్రా సంఘం కోర్టుకు వెళ్లడంతో మరో డీలర్‌కు అటాచ్ చేసే వ్యవహారంలో సెలవులో ఉన్న ఇన్‌స్పెక్టరు తాజాగా పంచాయితీ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. కొందరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు నగరంలో ఏళ్లతరబడి కొనసాగుతున్నారు. పైరవీలు సాగిస్తూ మాతృశాఖ రెవెన్యూకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. రాజకీయ నేతల సిఫారసులు, రెవెన్యూ సంఘం జోక్యంతో పౌరసరఫరాల శాఖలోనే కొనసాగడానికి వారు మొగ్గు చూపుతున్నారు. ఇదిలావుండగా రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల నుంచి ఇన్‌స్పెక్టర్లకు నెలవారీ మామూళ్లు అందుతాయన్నది బహిరంగ రహస్యం. ఒరిజినల్ డీలర్ రూ.1000, ఎండీయూ రూ.500, బినామీ డీలర్ రూ.2 వేల వరకు సమర్పించుకుంటారనే ఆరోపణలున్నాయి. ప్రొటోకాల్ ఖర్చుల కోసమంటూ వసూలు చేస్తున్నారని గాజువాకకు చెందిన డీలర్లు చెబుతున్నారు. ప్రతి రెండేళ్లకు (2025 ఏప్రిల్ ఒకటి నుంచి 2027 మార్చి 31 వరకు) ఒకసారి ప్రతి రేషన్ డిపోను అథంటికేషన్ చేసుకోవాలి. అంటే డీలర్ ఒరిజినల్ ఆర్డర్, రూ.500 చలానా, దరఖాస్తు పూర్తి చేసి పౌరసరఫరాల శాఖకు అందజేయాల్సి ఉంటుంది. దీనికి కూడా కొందరు ఇన్‌స్పెక్టర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని వన్‌టౌన్‌కు చెందిన పలువురు డీలర్లు చెబుతున్నారు. ఇదిలావుండగా నగరం నుంచి వేల టన్నుల బియ్యం శివారు ప్రాంతాలకు తరలిపోతుంటాయి. వీటిని పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టుకుని పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తుంటారు. ఈ పని చేయాల్సిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రం బియ్యం అక్రమ తరలింపుదారుల నుంచి భారీగా వసూలు చేస్తుంటారని సమాచారం.

సివిల్ సప్లయ్ శాఖలో ఆ ఉద్యోగిదే పెత్తనం

... 5వ పేజీ తరువాయి

పలు వీధులకు రైస్ బండి వెళ్లడం లేదని, వెంటనే స్పందించకపోతే జేసీతో చెప్పించి డీలర్/ఎండీయూను సస్పెండ్ చేస్తామని ఎమ్మెల్యే గారు చెప్పారు' అంటూ ఆడియో మెసేజ్ పెట్టారు. సెలవులో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ లేనిపోని పెత్తనం చేస్తున్నారని డీలర్లు/ఎండీయూలు వ్యాఖ్యానిస్తున్నారు. సెలవులో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారని, ఈ విషయం ప్రస్తుత ఇన్‌స్పెక్టర్‌కు తెలుసునని పేర్కొంటున్నారు. గతంలో విధులు నిర్వహించినప్పుడు కూడా ఈయన పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పెత్తనం చెలాయించేవారని డీలర్ల సంఘం నేత ఒకరు తెలిపారు. గతంలో పనిచేసిన డీఎస్‌వో దన్నుతో తానే డీఎస్‌వోనన్న దర్పం చూపుతూ కొందరు ఇన్‌స్పెక్టర్లతో కలిసి భారీగా వసూళ్లకు పాల్పడేవారని ఆరోపించారు. సెలవులో ఉన్నప్పటికీ సదరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్ డీలర్లు/ఎండీయూ వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టులు పెట్టడం గురించి అధికారులకు తెలిసినా ఎందుకు మౌనం దాల్చుతున్నారో అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానించారు.

ఎవరా ఉన్నతాధికారి?

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలోనే ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఆశీలు వసూలు కాంట్రాక్టు దక్కించుకున్న కూటమి చోటా నేత తనకు ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని రుబాబు చేయడంతో పాటు జీవీఎంసీ అధికారులను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ఏప్రిల్ ఒకటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా సొంత మనుషులతో ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించారు. రోడ్డుపై జంగిడీలు పెట్టించి అధిక ఆశీలు వసూలు చేసుకుని జేబులు నింపుకునే ప్రయత్నం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమవ్వడంతో సీపీ శంఖబ్రత బాగ్చి స్వయంగా రంగంలోకి దిగి మార్కెట్ పరిసరాల్లో రోడ్ల ఆక్రమణలను పూర్తిగా తొలగించేశారు. పూర్ణామార్కెట్ ఆశీలు వసూలు దక్కించుకున్న కాంట్రాక్టరుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం లేదని చెబుతూనే ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలతో ఆశీలు, పార్కింగ్ ఫీజును కాంట్రాక్టర్ వసూలు చేసుకుంటారంటూ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఒక ప్రకటన జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే మౌఖిక ఆదేశాలిచ్చిన ఆ ఉన్నతాధికారి ఎవరనేది మాత్రం జడ్సీ చెప్పకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. పైగా రెవెన్యూ సిబ్బంది ద్వారా డిపార్టుమెంటల్ కలెక్షన్ చేయించాల్సింది పోయి ప్రైవేటు వ్యక్తి వసూలు చేసుకుంటున్నారని చెప్పడం జడ్సీ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు. పార్కింగ్ ఫీజును కాంట్రాక్టర్ రెండింతలు అధికంగా వసూలు చేస్తున్నాడని, జీవీఎంసీ లోగో, కమిషనర్ పేరుతో టోకెన్లు ప్రింటింగ్ చేయించి, కారు పార్కింగ్‌కు రూ.పదికి బదులుగా రూ.20, బైక్ పార్కింగ్‌కు రూ.ఐదుకి బదులుగా రూ.పది వసూలు చేస్తున్నట్టు ఆధారాలతో సహా పత్రికల్లో కథనాలు వచ్చినా, జడ్సీ మాత్రం గెజిట్ ప్రకారమే పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని, అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవం కాదంటూ కాంట్రాక్టరుకు వత్తాసు పలకడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని జీవీఎంసీ అధికారులే ఆశ్చర్యపోతున్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌టీ కార్నర్స్

... 5వ పేజీ తరువాయి

కేంద్రాలు, 54 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 66 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల సిబ్బంది వీటిని ఏర్పాటు చేయగా, మిగిలిన వాళ్లు కూడా సోమవారం నాటికి ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశించారు. ఓఆర్‌టీ కార్నర్స్ నిర్వహణకు అనుగుణంగా పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐదు వేల చొప్పున, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు వెయ్యి చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రానున్న మూడు నెలలపాటు ఈ కేంద్రాలు నడిచేలా సిబ్బందికి ఆదేశాలు అందాయి. తొలి దశలో ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌టీ కార్నర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎండ తీవ్రతను బట్టి రానున్న రోజుల్లో ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, అంగన్వాడీ కేంద్రాలతోపాటు ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కార్నర్స్ వద్ద తప్పనిసరిగా ఆరోగ్యశాఖకు చెందిన ఒక సిబ్బంది ఉంటారు. రోగులతో పాటు కార్నర్ వద్దకు వచ్చే ప్రజలకు వీటిని తప్పనిసరిగా అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.

అందుబాటులో మరో 60 వేలు..

ప్రస్తుతం జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలకు సుమారు ఐదు లక్షల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అధికారులు పంపిణీ చేశారు. పెదవాల్తేరులోని సెంట్రల్ స్టోర్‌లో మరో 60 వేల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. కొద్దిరోజుల్లో జిల్లాకు మరో రెండు లక్షల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు వస్తాయని వారు చెబుతున్నారు. వీటిని ఆయా కేంద్రాల అవసరాల మేరకు పంపిస్తామని, కొత్తగా ఏర్పాటు చేయబోయే కేంద్రాలకు కూడా సరఫరా చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజలకు ఆరోగ్యశాఖ సూచనలు..

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. అందరూ ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలని, లేత వర్ణం, తేలికైన, కాటన్ దుస్తులను ధరించాలని వెల్లడించారు. రోజూ కనీసం 15 గ్లాసుల నీటిని తప్పకుండా తాగాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, భోజనం మితంగా చేయాలని, మిట్టమధ్యాహ్నం వేళ ఇళ్లలోనే ఉండాలని తెలిపారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటి వాటిని ధరించాలని, ఇంట్లో కిటికీలను తెరిచి ఉంచాలని, సూర్య కిరణాలు, వేడి గాలులు తగలకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌పై విక్రయించే చల్లని, రంగు పానీయాలకు దూరంగా ఉండాలని, మాంసాహారాన్ని తగ్గించాలని, మద్యం సేవించకపోవడమే మేలని తెలిపారు. ఎండ వేళ శరీరంపై భారం పడే పనులకు దూరంగా ఉండాలని, నలుపు దుస్తులు, మందంగా ఉండే దుస్తులను ధరించకూడదని అధికారులు తెలిపారు.

డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవి దృష్ట్యా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా బయట పనిచేసేవాళ్లు, ప్రయాణాలు సాగించేవారు అప్రమత్తంగా ఉండాలి. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల మధ్య బయటకు రాకుండా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ఇలా చేస్తుండాలి. ఓఆర్‌టీ కార్నర్స్‌లో ఇచ్చే ఓఆర్ఎస్ ద్రావణాన్ని ప్రజలు వినియోగించుకోవాలి. దీనివల్ల శరీరం ఎండ వేడిమి వల్ల ఇబ్బందులకు గురి కాకుండా ఉంటుంది.

- డాక్టర్ పి.జగదీశ్వరరావు
జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి


కూర్మన్నపాలెం : కణితి కాళింగ వీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


కూర్మన్నపాలెం : రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి


అగనంపూడి : జాబిలి హిల్స్ కాలనీలో నిర్వహిస్తున్న ఊరేగింపు


పెందుర్తి : పాతూరులో సీతారామ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

కమనీయం.. సీతారాముల కల్యాణం

» రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు » ఆలయాలకు పోటెత్తిన భక్తులు » పలు ప్రాంతాల్లో అన్నసమారాధనలు

ఆటోనగర్ ,ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలో శ్రీరామనవమి మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగాయి. వాడవాడలా రామాలయాలు, మరికొన్ని ప్రాంతాల్లో సీతారాముల విగ్రహాలను ఏర్పాటు చేసి కన్నుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. రామాలయాల వద్ద పందిళ్లు, టెంట్లు వేసి రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని జరిపారు. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కణితిలో....

జీవీఎంసీ 87వ వార్డులోని కణితి కాళింగుల వీధిలోని శ్రీసీతారామాలయంలో కల్యాణం కడు రమ్యంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తిరుమలనగర్ వాసి జి.విశ్వేశ్వరరావు భక్తులకు పానకం ప్రసాదాన్ని అందించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధాన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, విజయలక్ష్మి, పి.శంకరరావు, ప్రగడ శ్రీనువాసు, దుగ్గపు దానప్పలు, ముద్దపు దామోదర్, బడగల రాము, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ రాము, గొనప సన్యాసి నాయుడు, సన్యాసిరావు, పరమానందం, నాగభూషణం, పరమేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌సిటీలో...

జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్‌సిటీలో వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూపు ఆధ్వర్యంలో వాసు స్వామి, శ్రీధర్ స్వామి, చక్రపాణిల శిష్య బృందం పర్యవేక్షణలో శ్రీసీతారామ కళ్యాణం కన్నుల పండుగలా నిర్వహించారు. ఈ కల్యాణంలో సజ్జా పాండురంగ ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎం.డి. బండి సురేష్ కుమార్, పద్మజ, వీవీ కృష్ణారావు, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సునీల్, గణేష్, వెలగ వెంకట్రావు, పారిశ్రామికవేత్తలు యార్లగడ్డ సాంబశివరావు, కిషోర్, వేమూరి రమేష్, చిగురుపాటి రవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో..

గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో గల సీతారామ ఆలయాల్లో సీతారాముల విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. స్వామి వారి కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం అన్నసమారాధనలు చేపట్టారు. గాజువాక డ్రైవర్స్ కాలనీలో గల ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


గాజువాక : డ్రైవర్స్ కాలనీలోని రామాలయంలో శ్రీరాముల కల్యాణం

అగనంపూడిలో..

అగనంపూడి : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీల్లో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాత అగనంపూడి, కొండయ్యవలస, అండమాన్ కొండయ్యవలస, పెదమడక, పినమడక, బీసీ కాలనీ, దానబోయినపాలెం, గల్లవానిపాలెంలో గల రామాలయాల వద్ద నిర్వాహకులు శ్రీరామనవమి వేడులను నిర్వహించి సీతారాముల కల్యాణాన్ని జరిపారు. శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సాయినాయుడు, తదితరులు పాల్గొన్నారు. శనివాడ జాబిలిహిల్స్‌లో సీతారాముల కల్యాణం, ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో..

నెల్లిముక్కు రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. వేదపండితులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణంలో నిర్వాసిత కాలనీల పెద్దలు పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. సంజీవకాలనీ రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణం వేడుకల్లో మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు దంపతులు పాల్గొని కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. నడుపూరు రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ప్రియదర్శనీకాలనీ, హెచ్‌బీకాలనీ, సిద్ధేశ్వరం కాలనీల్లో రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం : షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం ఆద్యంతం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కల్యాణ వేడుకల్లో ఎస్టీబీ ఎల్ ఛైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతులు పెద్ద ఎత్తున మేళతాలాలతో వచ్చి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రధానార్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం సీతారాముల పట్టాభిషేకం నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం కొదండరామాలయం, నాతయ్యపాలెం రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రసాదుల శ్రీనివాసరావు, బొడ్డు వెంకటరమణ, సీరం రాజేశ్, అక్కిరెడ్డి శ్రీను, గోపిశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.. హరిజన జగ్గయ్యపాలెం, షీలానగర్, మిందీ రామాలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో..

గోపాలపట్నం : గోపాలపట్నం రైల్వేస్టేషన్ కూడలిలోని రామాలయంలో స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని, సాయంత్రం కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కొత్తపాలెంలోని గౌరీ రామాలయం, శ్రీకృష్ణదేవరాయకాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రశాంతినగర్‌లోని పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో జరిగిన వేడుకలో వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ సాయిబాబా జన్మనక్షత్రం నవమి కావడంతో ప్రశాంతినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, వైసీపీ నేత బెహరా భాస్కరరావులు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తి రూరల్: మండలంలోని పెదగాడి, చింతల అగ్రహారం, లక్ష్మీపురం, చీమలాపల్లి, పోర్లుపాలెం గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మండపాల వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెందుర్తిలో..

పెందుర్తి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సరిపల్లిలో గల రామాలయంలో సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పాత పెందుర్తి రామాలయం వద్ద పీఎవఎల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సీతారాముల కళ్యాణం నిర్వహిచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, టీడీపీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పీలా కృష్ణఅప్పారావు దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు.అనంతరం అన్న సమారాధన చేశారు. పెందుర్తి రాజుచెరువులో డీఆర్‌సీ ట్రస్ట్ ఎండీ దాడి ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో సీతారాములు కల్యాణం నిర్వహించి అన్నసమారాధన చేశారు.చినముషిడివాడ శాంతినగర్‌లో గల రామాలయం వద్ద సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది.అనంతరం భారీ అన్నసమారాదన నిర్వహించారు.చినముషిడివాడలోని పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ శాశ్వత ధర్మకర్త సేనాపతి శంకర్రావు ఆధ్వర్యంలో సీతారామకళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించరు.కార్పొరేటర్ సేనాపతి వసంత కళ్యాణంలో పాల్గొన్నారు.సుజాతనగర్ కార్మికనగర్‌లో చేపట్టిన అన్నసమారాధన కార్పొరేటర్ సేనాపతి వసంత ప్రారంభించారు. చినముషిడివాడలో గల చాణక్యనగర్ లో గల సీతారాముల ఆలయంలో కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు.వెంకటాద్రి శిఖరంపై ఆలయ సన్నిధిలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆర్‌ఆర్‌వెంకటాపురం, వేపగుంట, చినముషిడివాడ పాతూరు, పెందుర్తి పార్వతీనగర్‌లోనిరామాలయాంను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సందర్శించి పూజలు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

మే 20న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు విమర్శించారు. ఇందుకు నిరసనగా మే 20న అఖిల భారత సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాలనాయకత్వ వర్క్‌షాప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతుందన్నారు. దేశంలో ప్రజలతో పాటు, కార్మికులు, రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దేశసంపదను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలోజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎం శ్రీనివాస్, కుమార్, శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మునాయుడు, పి.తేజేశ్వరరావు, మన్యం జిల్లాఅధ్యక్షుడు డి.రమణారావు, వివిధజిల్లాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి

అనంతగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఓ రైల్వే ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన అలజంజి ప్రసాద్ (30) అనంతగిరి మండలం శివలింగపురం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబంతో బొడ్డవరలో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని బొడ్డవరకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, కొత్తూరు సమీపంలోని ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ప్రసాద్ అక్కడికక్కడ మరణించారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరికొద్ది క్షణాల్లో భర్త ఇంటికి వస్తానకుంటే మరణ వార్త వచ్చిందని భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో వైభవంగా నవమి వేడుకలు

మల్కాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మల్కాపురం, రెడ్డి వీధి రామాలయాలు, ప్రకాశనగర్ శివాలయం, శ్రీహరిపురం షిర్డిసాయిబాబా మరికొన్ని ఆలయాల్లో కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా చేపట్టారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్ :** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా),మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 24, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30,అల్లం (పాతది) 50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం18, మామిడిఅల్లం 64, బొప్పాయి42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం


గాజువాకలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక/సింధియా/ఎన్ఏడీజంక్షన్/మల్కాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక సంస్కరణలు తీసుకొచ్చి, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని బీజేపీ గాజువాక శాఖ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఆదివారం భాజపా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గాజువాకలో పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. నాయకులు గూటూరు శంకరరావు, ఎస్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు. జైఆంధ్రకాలనీలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా నాయకురాలు వర్రె లలితా పతాకావిష్కరణ చేశారు. ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ ములకలపల్లి ప్రకాష్, మల్కాపురం అధ్యక్షుడు మేరువ అనీల్ కుమార్, నాయకులు రాజారావు, వెంకటరావు, మేఘన పాల్గొన్నారు. ఎన్.ఎ.డి.జంక్షన్ ఫ్లైఓవర్ కింద బీజేపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి దాడి పురుషోత్తమ రమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు సి.హెచ్.మంజుల, గొట్టువాడ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు. మల్కాపురంలో కోరమాండల్ గేటు ఎదురుగా జరిగిన వేడుకలలో బీజేపీ నాయకులు గజపతిరావు, కలిదండి బద్రీనాథ్ పాల్గొన్నారు. బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించారు. హిమాచల్‌నగర్ వద్ద నాయకులు గురుమూర్తి, పోలిమేర శ్రీను తదితరులు మాట్లాడారు. ములగాడ మండల పరిధి శాంతిగిరికాలనీ, మారుతినగర్ తదితర ప్రాంతాల్లోనూ వేడుకలు జరిగాయి.

బొలేరో ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

అగనంపూడి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి దరి డొంకాడ కాలనీ వద్ద ఆదివారం ఉదయం బొలెరో వాహనం ఢీకొని నమ్మి అచ్చియ్యమ్మ (65) అనే వృద్ధురాలు మృతిచెందినట్లు దువ్వాడ పోలీసులు తెలిపారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఏదూరివానిపాలెం గ్రామానికి చెందిన ఆమె పినమడకలోని దుర్గమాంబ ఆలయానికి వెళ్లి ఇంటికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతోంది. అదే సమయంలో అనకాపల్లి నుంచి గాజువాక వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఆమెను బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అచ్చియమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి


సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

మల్కాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి హెచ్‌పీ పెట్రో పార్కు వద్ద ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మాచర్ల సత్యనారాయణ (48)ను లారీ ఢీకొట్టడంతో మృతి చెందినట్లు మల్కాపురం పోలీసులు తెలిపారు. సత్యనారాయణ ఇక్కడ మెయిన్‌రోడ్డులో పాన్‌షాప్ నడిపేవారు. నగరంలో ఉన్న కుమార్తెను పలకరించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే మార్గంలో వచ్చిన లారీ ఆయనను బలంగా ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మల్కాపురం పోలీసులు తెలిపారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక

... 5వ పేజీ తరువాయి

సుమారు 200 రోడ్ల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేస్తారు. రాత్రికి అరకులోయ చేరుకుని ఏపీటీడీసీ అతిథిగృహంలో బస చేస్తారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అరకులోయ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి ఇదే మండలం సుంకరమెట్ట సమీపంలోని కాఫీ తోటలకు చేరుకుంటారు. అటవీశాఖ చెక్కలతో నిర్మించిన కాలిబాట వంతెనను ప్రారంభిస్తారు. అనంతరంవిశాఖపట్నం పయనమవుతారు. డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎస్పీ అమిత్ బర్ధర్ పర్యవేక్షిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో సోమవారం చాపరాయి జల విహారిలో పర్యాటకుల ప్రవేశాన్ని రద్దు చేసినట్టు అధికారులు వెల్లడించారు.



దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

కన్నుల వైభోగం..కోదండరాముని కల్యాణం


అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో రాములోరి కల్యాణానికి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం


కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు


వన్‌టౌన్ ఘోషాసుపత్రి సమీపంలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు

మహారాణిపేట/డాబాగార్డెన్స్/అక్కయ్యపాలెం/సీతమ్మధార/మురళీనగర్/కంచరపాలెం/అల్లిపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాములోరి పెళ్లికి ఊరంతా పెద్దలే అన్నట్లు ఆబాలగోపాలం రాముల వారి సేవలో మునిగితేలారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లోనూ, చలువ పందిళ్ల కింద రాములోరి కల్యాణోత్సవాలను వేలాదిమంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా జరిపించారు. వందలాదిమంది దంపతులు పెళ్లి పెద్దలుగా కూర్చున్నారు. జైశ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి. వేద పండితులు సీతారామచంద్రస్వాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేక వేదికపై మంత్రోచ్చారణలతో ఆసీనులను చేసి సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువును జరిపించారు. ప్రతి ఘట్టం, దాని వెనుక ఉద్దేశాన్ని భక్తులకు వివరించారు. ప్రజల నడవడిక, బాధ్యతల నిర్వహణను చాటిచెపుతుందని పేర్కొన్నారు. పెద్దఎత్తున అన్న సమారాధనలు, వడపప్పు, పానకం, మజ్జిగ పంపిణీ జరిగింది. మహారాణిపేటలోని అంబికాబాగ్‌లో ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కె.శోభారాణి ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లగా కల్యాణ వేడుకను రమణీయంగా నిర్వహించారు. సహాయ కార్యనిర్వహణ అధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. సుమారు 53 సంవత్సరాల చరిత్ర కలిగిన పాత జైల్‌రోడ్డు గొల్లలపాలెం సీతారామాంజనేయ దేవాలయంలో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వేడుక జరిగింది. డాబాగార్డెన్స్‌లో శివరామకృష్ణ దేవాలయంలోని రామాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కన్నుల పండువగా వేడుకలు జరిగాయి. ఈవో జీవీ రమాబాయి, ఎం.మన్మథరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్కయ్యపాలెంలోని సాలిగ్రామపురం, దొండపర్తి ప్రాంతాల్లో భక్తులు తండోపతండాలుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్ గోపాల్ పానకం పంపిణీ చేశారు. గోలీలపాలెంలోని రామాలయంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కంచరపాలెం, తిక్కవానిపాలెం, రెడ్డికంచరపాలెం, గొల్ల కంచరపాలెం, ఆర్పీపేట, తుమ్మడిపాలెం, సూర్యనగర్ ఆలయాల్లో కల్యాణక్రతువు సంప్రదాయబద్ధంగా జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మురళీనగర్, మాధవధార, బర్మాక్యాంప్, సూర్యానగర్ ఆలయాల్లో భక్తులు కల్యాణ వేడుకలను వీక్షించారు. నక్కవానిపాలెం సీతారాముల ఆలయంలో నవమి పూజలను, కల్యాణ ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వాములకు వేద మంత్రాలతో అర్చకులు పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు తెచ్చిన సారెను తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ కమిటీ పర్యవేక్షణలో సుమారు 2,500 మంది భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. చైతన్యనగర్‌లో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించారు. అల్లిపురంలోని బంగారుమెట్ట రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట, అస్సాంగార్డెన్స్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సీతమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. వైర్లెస్ కాలనీ, కుమ్మరవీధి, వెంకటేశ్వరమెట్ట, అచ్చియ్యమ్మపేటలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.


నక్కవానిపాలెంలో సారె ఊరేగింపు


అలంకరణలో సీతారామలక్ష్మణమూర్తులు


డాబాగార్డెన్స్ శివరామకృష్ణ దేవాలయంలోని రామాలయంలో కల్యాణ ఉత్సవంలో పాల్గొన్న దంపతులు


మురళీనగర్ హైస్కూలు సమీపంలోని ఆలయంలో కల్యాణ రాముడు


కంచరపాలెంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కార్ల షోరూమ్‌లో అగ్నిప్రమాదం

మర్రిపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ హోటల్ సమీపంలో ఉన్న ఓ కార్ల షోరూంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగడంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షోరూంలోని స్టోర్ రూమ్‌లో ఉదయం ఒక్కసారిగా పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. గమనించిన కాలనీవాసులు భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చి, షోరూం సెక్యూరిటీవారికి విషయం తెలియజేశారు. స్టోర్ రూం తాళం లేదని, నిర్వాహకులు కూడా లేరని వారు బదులివ్వడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. స్టోర్ రూం వెనుక ఉన్న విద్యుత్ తీగలపై పక్షులు వాలి రెండువైర్లు తగిలి మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. సుమారు రూ 50 వేల వరకు ఆస్తినష్టం ఉంటుందని తెలిపారు. ఇకపై స్టోర్ రూంను ఉపయోగించవద్దని నిర్వాహకులకు తెలిపినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.


షోరూమ్ స్టోర్ గది నుంచి వెలువడుతున్న పొగలు

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలిపై కేసు నమోదు

గాజువాక, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మిపై గాజువాక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాతయ్యపాలెం ప్రాంతానికి చెందిన పి.నరేశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ, ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతను ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి, తమ వద్ద రూ.లక్షల్లో నగదు తీసుకున్నాడని గత నెల 2న అనంతలక్ష్మి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజున పోలీసులు నరేశ్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఎస్‌ఐ అతనితో మాట్లాడుతుండగా అనంతలక్ష్మి పోలీసుల ఎదుటే చెప్పు తీసి నరేశ్‌ను కొట్టారు. ఈ విషయమై నరేశ్ సీపీకి ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు గాజువాక పోలీసులు అనంతలక్ష్మిపై కేసు నమోదు చేశారు. గాజువాక సీఐ పార్థసారధిని కూడా అనంతలక్ష్మి అసభ్య పదజాలంతో దూషించిందని పోలీసులు తెలిపారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా నగదు విషయమై ఇద్దరి మధ్య గతంలో కూడా వివాదం నడిచింది.

కేజీహెచ్‌లో అనుమానాస్పద స్థితిలో వార్డుబాయ్ మృతి

మహారాణిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ప్రాంతానికి చెందిన ప్రశాంత్ కుమార్ (22) కేజీహెచ్‌లో వార్డు బాయ్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున అత్యవసర చికిత్సా విభాగంలో టాయిలెట్‌లో ఇంజక్షన్‌లు తీసుకొని మృతి చెంది ఉంటాడని అనుమానించిన ఆసుపత్రి అధికారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోతాదుకు మించి డ్రగ్స్ తీసుకోవటమో లేదా ప్రేమ వ్యవహారంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే విషయం తెలియాల్సి ఉంది. అవుట్ సోర్సింగ్ విభాగంలో వార్డుబాయ్‌గా పనిచేసేవాడు. కుటుంబ సభ్యులతో కలసి ఆరిలోవలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యాడు, రాత్రి రెండు గంటల వరకు ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వహించాడు. అనంతరం తోటి ఉద్యోగులు విశ్రాంతి తీసుకోగా, ప్రశాంత్ కుమార్ సమీపంలో ఉన్న టాయిలెట్ లోపలకి వెళ్లాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఎవరో టాయిలెట్‌కు వెళ్లగా లోపల గడియ పెట్టి ఉంది. ఎంతసేపటికి బయటకు రాకపోవటం, లోపల నుంచి స్పందన లేకపోవటంతో తలుపు బలవంతంగా తెరిచారు. లోపల కూర్చొని ఎలాంటి చలనం లేకుండా పడి ఉండడంతో ఆసుపత్రి ఉన్నతాధికారులు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్‌లు హుటాహుటిన అక్కడకు చేరుకొని పరిశీలించారు. రెండు సిరంజ్‌లతో ఇంజక్షన్ చేసుకొని ఉండటాన్ని గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.


మృతి చెందిన ప్రశాంత్‌కుమార్

చురుగ్గా కాలువ కాంక్రీట్ పనులు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని ఎన్.ఎ.డి. ఫ్లైఓవర్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ సర్వీస్‌రోడ్డు ఆనుకొని గతంలో ఉన్న కల్వర్టు కాలువకు బేస్‌మెంట్, ఇరువైపులా గోడ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు రూ.19 లక్షల జీవీఎంసీ నిధులతో పనులు చేపడుతున్నారు. ఈ కల్వర్టు ఇటు నుంచి రోడ్డు అవతలకు అనుసంధానం చేసే కల్వర్టు. అటువంటి ప్రధాన కల్వర్టుకు రక్షణగోడ పనులు చేపడుతున్నప్పటికీ వీటికి ప్రధానంగా చెత్తచెదారం వెళ్లకుండా ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా నీటితో చెత్త చెదారాలు విపరీతంగా వస్తున్నాయి. వీటిని నియంత్రించకపోతే రోడ్డు మధ్యలో నిలిచిపోయి మొత్తం నీరు స్తంభించిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు జరుగుతున్నప్పుడు చెత్త వెళ్లకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'అవినీతి నిర్మూలనకే బీజేపీ ఆవిర్భావం'

సీతమ్మధార, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అవినీతిని రూపుమాపేందుకే బీజేపీ ఆవిర్భవించిందని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు, సీనియర్ నాయకులు సనపాల రామ్మృష్ణ, ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ సురేష్‌బాబు తదితరులు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి మిఠాయి తినిపిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్‌రాజు

టీ 20 క్రికెట్ ఫైనల్స్‌కు గౌరీ యూత్, శారద సీసీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): యూఎఫ్‌యూ టీ 20 క్రికెట్ టోర్నీలో గౌరి యూత్ సిసి, శారద సిసిజట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం హిందుస్తాన్ జింక్‌గ్రౌండ్‌లో జరిగిన తొలి సెమీస్‌లో శారదసిసి 24 పరుగులతేడాతో పెంటమాంబ సిసిపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శారద సిసి 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 118 పరుగులు చేసింది. పెంటమాంబ బౌలర్లలో వెంకట నాగప్రసాద్, నరేష్ రాజ్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో పెంటమాంబ సిసి 16.4 ఓవర్లలో 88 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. మరో సెమీఫైనల్స్ మ్యాచ్‌లో గౌరీ యూత్ రెండు వికెట్ల తేడాతో ఉషోదయ సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉషోదయ సిసి నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 150 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గౌరీ యూత్ 19.4 ఓవర్లలో ఎనిమిది వికెట్లు నష్టపోయి 152 పరుగులో లక్ష్యాన్ని ఛేదించింది.

27న ఉత్తరాంధ్ర రజకుల అభినందన సభ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర రజకుల అభినందన సభ ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము తెలిపారు. స్థానిక శివశంకర్ ఫంక్షన్ హాల్లో రజక సంఘాల సమాఖ్య ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రాజమండ్రి నారాయణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉపాధి లేక జీవనోపాధికి నానా అవస్థలు పడ్డారన్నారు. 90 శాతం రజకులు టీడీపీలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డూరు శంకర్, పి.గురునాథరావు, చీపురుపల్లి స్వరూప్ పాల్గొన్నారు.

వచన కవితా సంపుటి ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, కమల్‌బైద్, ఎం.సుబ్బారావు తదితరులు

సీతంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళావేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ నండూరి రామకృష్ణ రాసిన 'సామాజిక నిత్య హితోక్తులు 3వ వచన కవితా సంపుటి'ని ఆదివారం ఆవిష్కరించారు. కళావేదిక పుస్తకాలయం గౌరవ అధ్యక్షుడు కమల్ బైద్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.సుబ్బారావు పుస్తకాన్ని విశ్లేషించారు. విశిష్ట అతిథులుగా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్-1 అధ్యక్షులు జి.తనూజరెడ్డి, జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కళావేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.రజనీ, కార్యదర్శి అరుణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తి తీర్చేందుకు గోలీ సోడాల పంపిణీ

సీతమ్మధార, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు గోలీ సోడాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నక్కవానిపాలెం శివాలయం ఎదురుగా లక్కీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు బండారు గుప్తాజీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సుమారు 2,500 గోలీ సోడాలు పంపిణీ చేయడం విశేషమని కొనియాడారు. రాజేష్ రెడ్డి, పైడిరాజు, శ్రీనివాస్ రెడ్డి, మురళీ, పవన్, గోవింద్, పండు, గణేష్, చిన్న, డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి, కోన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ పార్కు అభివృద్ధికి త్వరలో నిధులిస్తాం: జడ్సీ

మురళీనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్ పార్క్ అభివృద్ధికి సహకరిస్తామని జోన్-5 జెడ్సీ బి.రాము పేర్కొన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్ నవీకరణ, కొత్త పనులకు నిధులు త్వరలో అందిస్తామన్నారు. ఆదివారం పార్కులో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ జెడ్సీని సత్కరించారు. వ్యవస్థాపకుడు ఎన్.బుచ్చయ్య, కార్యవర్గ సభ్యులు, పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

... 5వ పేజీ తరువాయి

ఊరేగిస్తారు. స్వామివారు స్వర్ణనారసింహ కవచంలో భక్తులకు దర్శనమిస్తారు. 11న సాయంత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తారు. 12వ తేదీ వేకువజామున 3 గంటలకు సుప్రభాతసేవ చేశాక ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, తిరువీధి, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు మృగయోత్సవం (దొంగలదోపు ఉత్సవం), అశ్వవాహనంపై తిరువీధి, ధ్వజారోహణం జరుగుతాయి. 13వ తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 8 నుంచి వినోదోత్సవం (ఉంగరపు సేవ) నిర్వహిస్తారు.

దర్శన వేళల్లో మార్పు, ఆర్జిత సేవలు రద్దు

వార్షిక తిరు కల్యాణం, నిజరూప దర్శనం చందనోత్సవాలను పురస్కరించుకుని సింహాచలేశుని దర్శన వేళల్లో స్వల్ప మార్పు చేయడంతో పాటు ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈనెల 7 నుంచి 14 వరకు వేకువజామున జరిగే సుప్రభాతసేవ, ఉదయం, రాత్రి ఆరాధన సేవ టికెట్ల విక్రయాలను రద్దు చేశారు. 7వ తేదీ నుంచి 14 వరకు రాత్రి 7 గంటల తరువాత భక్తులకు దర్శనాలు లభించవు. అలాగే 7 నుంచి 23వ తేదీ వరకు ఆలయంలో జరిగే నిత్య కల్యాణం, స్వర్ణ పుష్పార్చన, సహస్రనామార్చన, గరుడసేవ, తదితర అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేశారు. 13న స్వామివారి శ్రీపుష్పయాగాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల హవా!

... 5వ పేజీ తరువాయి

మరొకరికి అప్పగించారు. దీనిపై డ్వాక్రా సంఘం కోర్టుకు వెళ్లడంతో మరో డీలర్‌కు అటాచ్ చేసే వ్యవహారంలో సెలవులో ఉన్న ఇన్‌స్పెక్టరు తాజాగా పంచాయితీ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. కొందరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు నగరంలో ఏళ్లతరబడి కొనసాగుతున్నారు. పైరవీలు సాగిస్తూ మాతృశాఖ రెవెన్యూకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. రాజకీయ నేతల సిఫారసులు, రెవెన్యూ సంఘం జోక్యంతో పౌరసరఫరాల శాఖలోనే కొనసాగడానికి వారు మొగ్గు చూపుతున్నారు. ఇదిలావుండగా రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల నుంచి ఇన్‌స్పెక్టర్లకు నెలవారీ మామూళ్లు అందుతాయన్నది బహిరంగ రహస్యం. ఒరిజినల్ డీలర్ రూ.1000, ఎండీయూ రూ.500, బినామీ డీలర్ రూ.2 వేల వరకు సమర్పించుకుంటారనే ఆరోపణలున్నాయి. ప్రొటోకాల్ ఖర్చుల కోసమంటూ వసూలు చేస్తున్నారని గాజువాకకు చెందిన డీలర్లు చెబుతున్నారు. ప్రతి రెండేళ్లకు (2025 ఏప్రిల్ ఒకటి నుంచి 2027 మార్చి 31 వరకు) ఒకసారి ప్రతి రేషన్ డిపోను అథంటికేషన్ చేసుకోవాలి. అంటే డీలర్ ఒరిజినల్ ఆర్డర్, రూ.500 చలానా, దరఖాస్తు పూర్తి చేసి పౌరసరఫరాల శాఖకు అందజేయాల్సి ఉంటుంది. దీనికి కూడా కొందరు ఇన్‌స్పెక్టర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని వన్‌టౌన్‌కు చెందిన పలువురు డీలర్లు చెబుతున్నారు. ఇదిలావుండగా నగరం నుంచి వేల టన్నుల బియ్యం శివారు ప్రాంతాలకు తరలిపోతుంటాయి. వీటిని పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టుకుని పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తుంటారు. ఈ పని చేయాల్సిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రం బియ్యం అక్రమ తరలింపుదారుల నుంచి భారీగా వసూలు చేస్తుంటారని సమాచారం.

సివిల్ సప్లయ్ శాఖలో ఆ ఉద్యోగిదే పెత్తనం

... 5వ పేజీ తరువాయి

పలు వీధులకు రైస్ బండి వెళ్లడం లేదని, వెంటనే స్పందించకపోతే జేసీతో చెప్పించి డీలర్/ఎండీయూను సస్పెండ్ చేస్తామని ఎమ్మెల్యే గారు చెప్పారు' అంటూ ఆడియో మెసేజ్ పెట్టారు. సెలవులో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ లేనిపోని పెత్తనం చేస్తున్నారని డీలర్లు/ఎండీయూలు వ్యాఖ్యానిస్తున్నారు. సెలవులో ఉన్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారని, ఈ విషయం ప్రస్తుత ఇన్‌స్పెక్టర్‌కు తెలుసునని పేర్కొంటున్నారు. గతంలో విధులు నిర్వహించినప్పుడు కూడా ఈయన పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పెత్తనం చెలాయించేవారని డీలర్ల సంఘం నేత ఒకరు తెలిపారు. గతంలో పనిచేసిన డీఎస్‌వో దన్నుతో తానే డీఎస్‌వోనన్న దర్పం చూపుతూ కొందరు ఇన్‌స్పెక్టర్లతో కలిసి భారీగా వసూళ్లకు పాల్పడేవారని ఆరోపించారు. సెలవులో ఉన్నప్పటికీ సదరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్ డీలర్లు/ఎండీయూ వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టులు పెట్టడం గురించి అధికారులకు తెలిసినా ఎందుకు మౌనం దాల్చుతున్నారో అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానించారు.

ఎవరా ఉన్నతాధికారి?

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలోనే ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఆశీలు వసూలు కాంట్రాక్టు దక్కించుకున్న కూటమి చోటా నేత తనకు ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని రుబాబు చేయడంతో పాటు జీవీఎంసీ అధికారులను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ఏప్రిల్ ఒకటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా సొంత మనుషులతో ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించారు. రోడ్డుపై జంగిడీలు పెట్టించి అధిక ఆశీలు వసూలు చేసుకుని జేబులు నింపుకునే ప్రయత్నం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమవ్వడంతో సీపీ శంఖబ్రత బాగ్చి స్వయంగా రంగంలోకి దిగి మార్కెట్ పరిసరాల్లో రోడ్ల ఆక్రమణలను పూర్తిగా తొలగించేశారు. పూర్ణామార్కెట్ ఆశీలు వసూలు దక్కించుకున్న కాంట్రాక్టరుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం లేదని చెబుతూనే ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలతో ఆశీలు, పార్కింగ్ ఫీజును కాంట్రాక్టర్ వసూలు చేసుకుంటారంటూ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఒక ప్రకటన జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే మౌఖిక ఆదేశాలిచ్చిన ఆ ఉన్నతాధికారి ఎవరనేది మాత్రం జడ్సీ చెప్పకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. పైగా రెవెన్యూ సిబ్బంది ద్వారా డిపార్టుమెంటల్ కలెక్షన్ చేయించాల్సింది పోయి ప్రైవేటు వ్యక్తి వసూలు చేసుకుంటున్నారని చెప్పడం జడ్సీ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు. పార్కింగ్ ఫీజును కాంట్రాక్టర్ రెండింతలు అధికంగా వసూలు చేస్తున్నాడని, జీవీఎంసీ లోగో, కమిషనర్ పేరుతో టోకెన్లు ప్రింటింగ్ చేయించి, కారు పార్కింగ్‌కు రూ.పదికి బదులుగా రూ.20, బైక్ పార్కింగ్‌కు రూ.ఐదుకి బదులుగా రూ.పది వసూలు చేస్తున్నట్లు ఆధారాలతో సహా పత్రికల్లో కథనాలు వచ్చినా, జడ్సీ మాత్రం గెజిట్ ప్రకారమే పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని, అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవం కాదంటూ కాంట్రాక్టరుకు వత్తాసు పలకడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని జీవీఎంసీ అధికారులే ఆశ్చర్యపోతున్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌టీ కార్నర్స్

... 5వ పేజీ తరువాయి

కేంద్రాలు, 54 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 66 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల సిబ్బంది వీటిని ఏర్పాటు చేయగా, మిగిలిన వాళ్లు కూడా సోమవారం నాటికి ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశించారు. ఓఆర్‌టీ కార్నర్స్ నిర్వహణకు అనుగుణంగా పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐదు వేల చొప్పున, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు వెయ్యి చొప్పున ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రానున్న మూడు నెలలపాటు ఈ కేంద్రాలు నడిచేలా సిబ్బందికి ఆదేశాలు అందాయి. తొలి దశలో ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌టీ కార్నర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎండ తీవ్రతను బట్టి రానున్న రోజుల్లో ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, అంగన్వాడీ కేంద్రాలతోపాటు ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కార్నర్స్ వద్ద తప్పనిసరిగా ఆరోగ్యశాఖకు చెందిన ఒక సిబ్బంది ఉంటారు. రోగులతో పాటు కార్నర్ వద్దకు వచ్చే ప్రజలకు వీటిని తప్పనిసరిగా అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.

అందుబాటులో మరో 60 వేలు..

ప్రస్తుతం జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలకు సుమారు ఐదు లక్షల వరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అధికారులు పంపిణీ చేశారు. పెదవాల్తేరులోని సెంట్రల్ స్టోర్‌లో మరో 60 వేల వరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. కొద్దిరోజుల్లో జిల్లాకు మరో రెండు లక్షల వరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వస్తాయని వారు చెబుతున్నారు. వీటిని ఆయా కేంద్రాల అవసరాల మేరకు పంపిస్తామని, కొత్తగా ఏర్పాటు చేయబోయే కేంద్రాలకు కూడా సరఫరా చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజలకు ఆరోగ్యశాఖ సూచనలు..

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. అందరూ ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలని, లేత వర్ణం, తేలికైన, కాటన్ దుస్తులను ధరించాలని వెల్లడించారు. రోజూ కనీసం 15 గ్లాసుల నీటిని తప్పకుండా తాగాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, భోజనం మితంగా చేయాలని, మిట్టమధ్యాహ్నం వేళ ఇళ్లలోనే ఉండాలని తెలిపారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటి వాటిని ధరించాలని, ఇంట్లో కిటికీలను తెరిచి ఉంచాలని, సూర్య కిరణాలు, వేడి గాలులు తగలకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌పై విక్రయించే చల్లని, రంగు పానీయాలకు దూరంగా ఉండాలని, మాంసాహారాన్ని తగ్గించాలని, మద్యం సేవించకపోవడమే మేలని తెలిపారు. ఎండ వేళ శరీరంపై భారం పడే పనులకు దూరంగా ఉండాలని, నలుపు దుస్తులు, మందంగా ఉండే దుస్తులను ధరించకూడదని అధికారులు తెలిపారు.

డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవి దృష్ట్యా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా బయట పనిచేసేవాళ్లు, ప్రయాణాలు సాగించేవారు అప్రమత్తంగా ఉండాలి. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల మధ్య బయటకు రాకుండా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ఇలా చేస్తుండాలి. ఓఆర్‌టీ కార్నర్స్‌లో ఇచ్చే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని ప్రజలు వినియోగించుకోవాలి. దీనివల్ల శరీరం ఎండ వేడిమి వల్ల ఇబ్బందులకు గురి కాకుండా ఉంటుంది.

- డాక్టర్ పి.జగదీశ్వరరావు
జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి


కూర్మన్నపాలెం : కణితి కాళింగ వీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


కూర్మన్నపాలెం : రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి


అగనంపూడి : జాబిలి హిల్స్ కాలనీలో నిర్వహిస్తున్న ఊరేగింపు


పెందుర్తి : పాతూరులో సీతారామ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

కమనీయం.. సీతారాముల కల్యాణం

» రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు » ఆలయాలకు పోటెత్తిన భక్తులు » పలు ప్రాంతాల్లో అన్నసమారాధనలు

ఆటోనగర్ ,ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలో శ్రీరామనవమి మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగాయి. వాడవాడలా రామాలయాలు, మరికొన్ని ప్రాంతాల్లో సీతారాముల విగ్రహాలను ఏర్పాటు చేసి కన్నుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. రామాలయాల వద్ద పందిళ్లు, టెంట్లు వేసి రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని జరిపారు. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కణితిలో....

జీవీఎంసీ 87వ వార్డులోని కణితి కాళింగుల వీధిలోని శ్రీసీతారామాలయంలో కల్యాణం కడు రమ్యంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తిరుమలనగర్ వాసి జి.విశ్వేశ్వరరావు భక్తులకు పానకం ప్రసాదాన్ని అందించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధాన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, విజయలక్ష్మి, పి.శంకరరావు, ప్రగడ శ్రీనువాసు, దుగ్గపు దానప్పలు, ముద్దపు దామోదర్, బడగల రాము, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ రాము, గొనప సన్యాసి నాయుడు, సన్యాసిరావు, పరమానందం, నాగభూషణం, పరమేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌సిటీలో...

జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్‌సిటీలో వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూపు ఆధ్వర్యంలో వాసు స్వామి, శ్రీధర్ స్వామి, చక్రపాణిల శిష్య బృందం పర్యవేక్షణలో శ్రీసీతారామ కళ్యాణం కన్నుల పండుగలా నిర్వహించారు. ఈ కల్యాణంలో సజ్జా పాండురంగ ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎం.డి. బండి సురేష్ కుమార్, పద్మజ, వీవీ కృష్ణారావు, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సునీల్, గణేష్, వెలగ వెంకట్రావు, పారిశ్రామికవేత్తలు యార్లగడ్డ సాంబశివరావు, కిషోర్, వేమూరి రమేష్, చిగురుపాటి రవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో..

గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో గల సీతారామ ఆలయాల్లో సీతారాముల విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. స్వామి వారి కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం అన్నసమారాధనలు చేపట్టారు. గాజువాక డ్రైవర్స్ కాలనీలో గల


గాజువాక : డ్రైవర్స్ కాలనీలోని రామాలయంలో శ్రీరాముల కల్యాణం

ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అగనంపూడిలో..

అగనంపూడి : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీల్లో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాత అగనంపూడి, కొండయ్యవలస, అండమాన్ కొండయ్యవలస, పెదమడక, పినమడక, బీసీ కాలనీ, దానబోయినపాలెం, గల్లవానిపాలెంలో గల రామాలయాల వద్ద నిర్వాహకులు శ్రీరామనవమి వేడులను నిర్వహించి సీతారాముల కల్యాణాన్ని జరిపారు. శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సాయినాయుడు, తదితరులు పాల్గొన్నారు. శనివాడ జాబిలిహిల్స్‌లో సీతారాముల కల్యాణం, ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో..

నెల్లిముక్కు రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. వేదపండితులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణంలో నిర్వాసిత కాలనీల పెద్దలు పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. సంజీవకాలనీ రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణం వేడుకల్లో మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు దంపతులు పాల్గొని కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. నడుపూరు రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ప్రియదర్శనీకాలనీ, హెచ్‌బీకాలనీ, సిద్ధేశ్వరం కాలనీల్లో రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం : షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం ఆద్యంతం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కల్యాణ వేడుకల్లో ఎస్టీబీ ఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతులు పెద్ద ఎత్తున మేళతాలాలతో వచ్చి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రధానార్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం సీతారాముల పట్టాభిషేకం నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం కొదండరామాలయం, నాతయ్యపాలెం రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రసాదుల శ్రీనివాసరావు, బొడ్డు వెంకటరమణ, సీరం రాజేష్, అక్కిరెడ్డి శ్రీను, గోపిశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.. హరిజన జగ్గయ్యపాలెం, షీలానగర్, మింది రామాలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో..

గోపాలపట్నం : గోపాలపట్నం రైల్వేస్టేషన్ కూడలిలోని రామాలయంలో స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని, సాయంత్రం కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కొత్తపాలెంలోని గౌరీ రామాలయం, శ్రీకృష్ణదేవరాయకాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రశాంతినగర్ లోని పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో జరిగిన వేడుకలో వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ సాయిబాబా జన్మనక్షత్రం నవమి కావడంతో ప్రశాంతినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, వైసీపీ నేత బెహరా భాస్కరరావులు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తి రూరల్: మండలంలోని పెదగాడి, చింతల అగ్రహారం, లక్ష్మీపురం, చీమలాపల్లి, పొర్లుపాలెం గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మండపాల వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెందుర్తిలో..

పెందుర్తి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సరిపల్లిలో గల రామాలయంలో సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పాత పెందుర్తి రామాలయం వద్ద పీఎవఎల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సీతారాముల కళ్యాణం నిర్వహిచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, టీడీపీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పీలా కృష్ణఅప్పారావు దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు.అనంతరం అన్న సమారాధన చేశారు. పెందుర్తి రాజుచెరువులో డీఆర్‌సీ ట్రస్ట్ ఎండీ దాడి ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో సీతారాములు కల్యాణం నిర్వహించి అన్నసమారాధన చేశారు.చినముషిడివాడ శాంతినగర్‌లో గల రామాలయం వద్ద సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది.అనంతరం భారీ అన్నసమారాదన నిర్వహించారు.చినముషిడివాడలోని పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ శాశ్వత ధర్మకర్త సేనాపతి శంకర్రావు ఆధ్వర్యంలో సీతారామకళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించరు.కార్పొరేటర్ సేనాపతి వసంత కళ్యాణంలో పాల్గొన్నారు.సుజాతనగర్ కార్మికనగర్‌లో చేపట్టిన అన్నసమారాధన కార్పొరేటర్ సేనాపతి వసంత ప్రారంభించారు. చినముషిడివాడలో గల చాణక్యనగర్ లో గల సీతారాముల ఆలయంలో కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు.వెంకటాద్రి శిఖరంపై ఆలయ సన్నిధిలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆర్ఆర్‌వెంకటాపురం, వేపగుంట, చినముషిడివాడ పాతూరు, పెందుర్తి పార్వతీనగర్‌లోనిరామాలయాంను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాము సందర్శించి పూజలు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

మే 20న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు విమర్శించారు. ఇందుకు నిరసనగా మే 20న అఖిల భారత సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాలనాయకత్వ వర్క్‌షాప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతుందన్నారు. దేశంలో ప్రజలతో పాటు, కార్మికులు, రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దేశసంపదను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలోజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎం శ్రీనివాస్, కుమార్, శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మునాయుడు, పి.తేజేశ్వరరావు, మన్యం జిల్లాఅధ్యక్షుడు డి.రమణారావు, వివిధజిల్లాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి

అనంతగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఓ రైల్వే ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన అలజంజి ప్రసాద్ (30) అనంతగిరి మండలం శివలింగపురం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబంతో బొడ్డవరలో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని బొడ్డవరకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, కొత్తూరు సమీపంలోని ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ప్రసాద్ అక్కడికక్కడ మరణించారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరికొద్ది క్షణాల్లో భర్త ఇంటికి వస్తానకుంటే మరణ వార్త వచ్చిందని భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతగిరి ఎస్‌ఐ డి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో వైభవంగా నవమి వేడుకలు

మల్కాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మల్కాపురం, రెడ్డి వీధి రామాలయాలు, ప్రకాశనగర్ శివాలయం, శ్రీహరిపురం షిర్డిసాయిబాబా మరికొన్ని ఆలయాల్లో కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా చేపట్టారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్ :** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా),మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 24, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30,అల్లం (పాతది) 50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం18, మామిడిఅల్లం 64, బొప్పాయి42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం


గాజువాకలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక/సింధియా/ఎన్ఏడీజంక్షన్/మల్కాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక సంస్కరణలు తీసుకొచ్చి, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని బీజేపీ గాజువాక శాఖ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఆదివారం భాజపా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గాజువాకలో పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. నాయకులు గూటూరు శంకరరావు, ఎస్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు. జైఆంధ్రకాలనీలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా నాయకురాలు వర్రె లలితా పతాకావిష్కరణ చేశారు. ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ ములకలపల్లి ప్రకాష్, మల్కాపురం అధ్యక్షుడు మేరువ అనీల్ కుమార్, నాయకులు రాజారావు, వెంకటరావు, మేఘన పాల్గొన్నారు. ఎన్.ఎ.డి.జంక్షన్ ఫ్లైఓవర్ కింద బీజేపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి దాడి పురుషోత్తమ రమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు సి.హెచ్.మంజుల, గొట్టువాడ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు. మల్కాపురంలో కోరమాండల్ గేటు ఎదురుగా జరిగిన వేడుకలలో బీజేపీ నాయకులు గజపతిరావు, కలిదండి బద్రీనాథ్ పాల్గొన్నారు. బీజేపీ పతాకాన్ని అవిష్కరించారు. హిమాచల్‌నగర్ వద్ద నాయకులు గురుమూర్తి, పోలిమేర శ్రీను తదితరులు మాట్లాడారు. ములగాడ మండల పరిధి శాంతిగిరికాలనీ, మారుతినగర్ తదితర ప్రాంతాల్లోనూ వేడుకలు జరిగాయి.

బొలేరో ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

అగనంపూడి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి దరి డొంకాడ కాలనీ వద్ద ఆదివారం ఉదయం బొలెరో వాహనం ఢీకొని నమ్మి అచ్చియ్యమ్మ (65) అనే వృద్ధురాలు మృతిచెందినట్లు దువ్వాడ పోలీసులు తెలిపారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఏదూరివానిపాలెం గ్రామానికి చెందిన ఆమె పినమడకలోని దుర్గమాంబ ఆలయానికి వెళ్లి ఇంటికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతోంది. అదే సమయంలో అనకాపల్లి నుంచి గాజువాక వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఆమెను బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అచ్చియమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి


సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

మల్కాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి హెచ్‌పీ పెట్రో పార్కు వద్ద ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మాచర్ల సత్యనారాయణ (48)ను లారీ ఢీకొట్టడంతో మృతి చెందినట్లు మల్కాపురం పోలీసులు తెలిపారు. సత్యనారాయణ ఇక్కడ మెయిన్‌రోడ్డులో పాన్‌షాప్ నడిపేవారు. నగరంలో ఉన్న కుమార్తెను పలకరించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే మార్గంలో వచ్చిన లారీ ఆయనను బలంగా ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మల్కాపురం పోలీసులు తెలిపారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక

... 5వ పేజీ తరువాయి

సుమారు 200 రోడ్ల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేస్తారు. రాత్రికి అరకులోయ చేరుకుని ఏపీటీడీసీ అతిథిగృహంలో బస చేస్తారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అరకులోయ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి ఇదే మండలం సుంకరమెట్ట సమీపంలోని కాఫీ తోటలకు చేరుకుంటారు. అటవీశాఖ చెక్కలతో నిర్మించిన కాలిబాట వంతెనను ప్రారంభిస్తారు. అనంతరంవిశాఖపట్నం పయనమవుతారు. డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎస్పీ అమిత్ బర్ధార్ పర్యవేక్షిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో సోమవారం చాపరాయి జల విహారిలో పర్యాటకుల ప్రవేశాన్ని రద్దు చేసినట్టు అధికారులు వెల్లడించారు.


తలంబ్రాల వేడుక

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు